

రంజాన్ వేళలు

ఇఫ్తార్ (సోమవారం) : 6.23

సహరి (మంగళవారం) : 4.39


ఉష్ణోగ్రతలు

ప్రాంతం	గరిష్ఠం	కనిష్ఠం
నెల్లూరు	41.0	26.0
కావలి	41.0	27.0
కందుకూరు	39.0	28.0
ఆత్మకూరు	42.0	27.0
ఉదయగిరి	43.0	25.0

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

3



శ్రీ పొట్టిశ్రీరాములు

నెల్లూరు

జిల్లా వార్తలు


సోమవారం 8 ఏప్రిల్ 2024



కర్నూలు తలపిస్తున్న ఆర్టీసీ బస్టాండ్ ప్రాంతం



జనసంచారం లేని బట్వాడిపాలెం సెంటర్



ఎస్పీ కార్యాలయం వద్ద రాకపోకల్లేని పొదలకూరు రోడ్డు



నిర్మానుష్యంగా గాంధీబొమ్మ కూడలి

ఉదయగిరి : గొడుగు వేసుకొని వెళుతున్న చిన్నారి



బండిపై వెళుతున్నా ముసుగు తప్పదు మరి !



ఎన్ని నీళ్లు తాగాలో..



అబ్బా ఏమి ఎండ... కాస్త గొడుగు పట్టు !

సన్ డే!

- మండిన ఎండ
- అల్లాడిన జనం
- నిర్మానుష్యంగా నగర వీధులు

జిల్లాలో పెరిగిన వేసవి తీవ్రతతో ప్రజలు అల్లాడుతున్నారు. ఉష్ణోగ్రతలు ఏకంగా 41 డిగ్రీలకుపైగా నమోదు కావటం ఆందోళనకు గురిచేస్తుంది. దీంతో ఉదయం 9 గంటలపైన బయటకు రావాలంటే ప్రజలు బెంబేతెత్తిపోతున్నారు. సాయంత్రం 5 గంటల వరకు ఇళ్లలోనే ఉండిపోతున్నారు. రానున్న రోజుల్లో ఎండల తీవ్రత మరింతగా పెరిగే అవకాశం ఉంటుందని వాతావరణ శాఖ ప్రకటించింది.దీంతో తగిన జాగ్రత్తలు తీసుకోకుండా బయటకు వెళ్లద్దని వైద్యులు హెచ్చరిస్తున్నారు. ఈ క్రమలో ఆదివారం నెల్లూరు నగరంలో కనపించని దృశ్యాలివి. -నెల్లూరు (వైద్యం)

ఇల్లు పాతది.. బిల్లు కొత్తది !

- గృహాలు నిర్మించకనే నిర్మించినట్లు బిల్లుల స్వాహా
- కాసులు కురిపిస్తున్న పేదలందరికీ ఇళ్లు పథకం
- వైసీపీ నేతలు, హౌసింగ్ సిబ్బంది చేతివాటం
- ఎన్నికల కోడ్‌కు ముందే భారీగా అప్‌లోడ్!
- జేసీ విచారణ ఏమైందో..?

నెల్లూరు, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): పేదలకు కోసం ఉద్దేశించిన నవరత్నాలు-పేదలందరికీ ఇళ్ల పథకం వైసీపీ నేతలు, హౌసింగ్ అధికారులకు కాసులు కురిపిస్తోంది. పేదల ముసుగులో కొందరు అధికారపార్టీ నేతలు, హౌసింగ్ సిబ్బంది ప్రభుత్వ సొమ్మును దోచుకుంటున్నారు. కొత్తగా ఇల్లు కట్టకుండానే ఎప్పుడో కట్టిన ఇంటికి ఇప్పుడు బిల్లులు డ్రా చేస్తూ ప్రజాధనాన్ని కొల్లగొడుతున్నారు. కొన్ని వేల దొంగ ఇళ్లను సృష్టించి వాటి పేరిట రూ.కోట్లు కాజేశారు. ఈ వ్యవహారం రెండేళ్ల కిందటే వెలుగులోకి వచ్చింది. ఆధారాలతో సహా వెలుగుచూడడంతో అప్పటి జాయింట్ కలెక్టర్‌ను కలెక్టర్ విచారణకు ఆదేశించారు. ఆ తర్వాత కొన్నాళ్లు సొంత స్థలాల్లో ఇళ్ల జోలికి వెళ్లకుండా లేఅవుట్ల ఇళ్లపై దృష్టి పెట్టారు. అయితే ఎన్నికలు సమీపిస్తుండడంతో మరోమారు విచ్చలవిడిగా పాత ఇళ్లకు బిల్లులు పెట్టుకున్నారు. ఇటీవల ఈ బిల్లులు పడుతుండడంతో మరోమారు ఈ అవినీతి వ్యవహారం చర్చనీయాంశంగా మారింది. పొదలకూరు మండలంలో విచ్చలవిడిగా పాత ఇళ్లకు బిల్లులు తీసుకున్నట్లు తాజాగా వెలుగులోకి వచ్చింది. స్థానిక హౌసింగ్ అధికారులు కూడా ఈ విషయాన్ని ధ్రువీకరిస్తున్నారు. పొదలకూరే కాదని జిల్లా మొత్తం ఇదే పరిస్థితి ఉందని చెబుతున్నారు. జిల్లాలో మొత్తం నిర్మించిన ఇళ్లలో సగానికిపైగా సొంత స్థలాల్లోనే నిర్మించారు. అందులోనూ మూడొంతుల ఇళ్లు పాతవే ఉన్నాయన్న ప్రచారం జరుగుతోంది.

● జేసీ విచారణ ఏమైందో..?

తిలాపాపం తలాపిడికెడు అన్నట్లుగా పేదల ముసుగులో కొందరు అధికారపార్టీ నేతలు, హౌసింగ్ సిబ్బంది ప్రజాధనాన్ని దిగమింగా రన్న ఆరోపణలు వెల్లువెత్తున్నాయి. లేఅవుట్లు, సొంత స్థలాల్లో నిర్మించే ఇళ్లలో భారీ అవినీతి జరిగినట్లు గతంలోనే ఆధారాలు బయటపడ్డాయి. సొంతస్థలాల్లో పాత ఇళ్లకు బిల్లులు పెట్టడం ఒక ఎత్తయితే, లేఅవుట్లలో గోడలు నిర్మించి బిల్లులు డ్రా చేసు కోవడం మరో ఎత్తు. ఈ అక్రమాలపై ఆధారాలతో సహా ఫిర్యాదులు వెల్లువెత్తడంతో ఏడాదన్నర కిందట అప్పటి కలెక్టర్ కేవీఎన్ చక్రధర్‌బాబు విచారణకు ఆదేశించారు. జేసీ రోణంకి కూర్మనాథ్‌ను విచారణ అధికారిగా నియమించారు. అయితే ఆ విచారణ ఏమైందన్నది ప్రశ్నార్థకంగా మారింది. ప్రజాధనాన్ని దోచుకుంటున్నట్లు బట్టబయలైనా ఉన్నతాధికారులు కూడా మౌనం దాల్చడంతో అవినీతిపరులకు మరింత బలం చేకూరింది. జిల్లాకు 97,121 ఇళ్లను మంజూరు చేయగా, ఇప్పటి వరకూ 21,699 ఇళ్లను పూర్తి చేసినట్లు అధికారిక లెక్కలు చెబుతున్నాయి. అందులో సొంత స్థలాల్లో ఇళ్లు నిర్మించుకున్న వారి సంఖ్యనే 12 వేలకు పైగా ఉంది. ఈ ఇళ్లల్లోనూ మూడొంతులు నిర్మించకుండానే పాత ఇళ్లను చూపించి బిల్లులు తినేశారు.



● అన్నింటికి ఒకటే ఫొటో

ఒక ఇంటి నిర్మాణం మొదలై బిల్లులు మంజూరు కావాలంటే అందుకు వివిధ దశలున్నాయి. బేస్‌లెవల్, లింటెల్ లెవల్, రూఫ్‌కాస్ట్ లెవల్, కంప్లీట్.. ఇలా ప్రతీ దశలోనూ అధికారులు పరిశీలించి ఎంబుక్ రికార్డు చేసిన తర్వాతనే లబ్ధిదారుడి ఖాతాల్లో బిల్లులు జమవుతాయి. ప్రతీ సందర్భంలోనూ ఇంటి స్థలంలో జియో ట్యాగింగ్ చేస్తూ ఇంటి ఫొటోను అప్‌లోడ్ చేయాల్సి ఉంది. ఆ స్థలంలో కాకుండా మరో స్థలంలో నుంచి జియోట్యాగింగ్ చేస్తే అక్షాంశాలు, రేఖాంశాలు సరిపోలవు. దీనిని వెబ్‌సైట్ తిరస్కరిస్తుంది. కాబట్టి కచ్చితంగా లబ్ధిదారుడి స్థలంలోని ఇంటినే ఫొటో తీసి అప్‌లోడ్ చేయాల్సి ఉంది. ఈ కారణంగానే చాలా ఇళ్లకు బేస్ లెవల్ సందర్భంలోనూ పూర్తయిన ఇంటి ఫొటోనే, లింటెల్ లెవల్‌లోనూ పూర్తయిన ఇంటి ఫొటోనే, రూఫ్‌కాస్ట్ లెవల్‌లోనూ అదే ఫొటోను అప్‌లోడ్ చేశారు. ఇక్కడ అక్రమార్కుల బండారం బయటపడింది. ఈ నిర్మాణాలను ఏఈలు నేరుగా పరిశీలించాలి. వాటిల్లో డీఈలు కనీసం 30 శాతం, ఈఈలు పది శాతం ఇళ్లను తనిఖీ చేయాలి. కానీ వారు ఈ అక్రమాలను పట్టించుకోలేదు. వారికి కూడా భాగం ఉండబట్టే చూసీచూడనట్లు వదిలేశారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. పేదలందరికీ ఇళ్ల పథకం పేదలకు సొంత గూడు నిర్మించలేదు కానీ అనేక మంది హౌసింగ్ సిబ్బందికి భారీ భవంతులను నిర్మించి ఇచ్చింది. కొందరు అధికారులు ఏకంగా రూ.కోట్లకు పడగలెత్తినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. విజిలెన్స్, ఏసీబీ అధికారులు హౌసింగ్‌లో జరుగుతున్న వ్యవహారాలపై దృష్టి పెడితే అనేక అక్రమాలు వెలుగుచూసే అవకాశముస్నట్లు ఆ శాఖలోని కొందరు సిబ్బందే చెబుతుండడం గమనార్హం.

డిప్యుటేషన్ల రద్దు



- వైద్య ఆరోగ్యశాఖ కమిషనర్ ఆదేశాలు
- జిల్లా కేంద్రంలోనే 40 మంది ఉద్యోగులు
- తాజా ఉత్తర్వులు అమలయ్యేనా...?
- జీవో విడుదల కాకనే బదిలీ
- కలెక్టర్ ఆదేశాలతోనే చేశాం : డీఎంహెచ్‌వో

నెల్లూరు (వైద్యం) ఏప్రిల్ 7: వైద్య ఆరోగ్య శాఖలో డిప్యుటేషన్లను రద్దు చేస్తూ శనివారం రాత్రి వైద్యఆరోగ్య, కుటుంబ సంక్షేమశాఖ కమిషనర్ నివాస్ ఆదేశాలు జారీ చేశారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆ ఆదేశాల్లో పేర్కొన్నారు. ఆ ఆదేశాల మేరకు వైద్యశాఖలో అత్యవసర డిప్యుటేషన్ మినహా మిగిలిన డిప్యూటేషన్లు రద్దు చేయాల్సి ఉంది.

● నేడో, రేపో నివేదిక

జిల్లా వ్యాప్తంగా 52 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, 28 పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలతోపాటు ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి, ఆత్మకూరు జిల్లా ఆసుపత్రి, కావలి, కందుకూరు ఏరియా ఆసుపత్రులు, 10 సామాజిక ఆరోగ్య కేంద్రాలు ఉన్నాయి. వీటిలో 4వేల మందికిపైగా ఉద్యోగులు పనిచేస్తున్నారు. అయితే వైద్య ఆరోగ్య శాఖలోనే ఎక్కువగా డిప్యుటేషన్‌లు జరిగాయి. ఇందులో వైద్య ఆరోగ్యశాఖ జిల్లా కార్యాలయంలోనే దాదాపు 40 మంది వరకు డిప్యుటేషన్లపై వచ్చినవారే ఉన్నారు. ఇందులో వైద్యులతోపాటు పీహెచ్‌సీల్లో పనిచేసే ఎంపీ హెచ్‌ఈవోలు, హెల్త్ ఎడ్యుకేటర్లు, హెల్త్ సూపర్‌వైజర్లు, ఫార్మాసిస్టులు ఉన్నారు. తాజా ఉత్తర్వులతో వీరందరి డిప్యుటేషన్లు రద్దయ్యే అవకాశం ఉంది. ఇదిలా ఉంటే కేవలం నోటి మాటతో డిప్యుటేషన్లపై ఉద్యోగులు జిల్లా కేంద్రంలో పనిచేస్తున్నట్లు విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో కమిషనర్ ఆదేశాలను ఎంత వరకు అమలు చేస్తారోనన్న సందేహం లేకపోలేదు. దీనిపై పూర్తిస్థాయి నివేదికను సోమ, మంగళవారాల్లో అందచేయనున్నట్లు అధికారులు చెబుతున్నారు.

● ఇద్దరు వైద్యులపై విమర్శలు

కాగా ఇద్దరు వైద్యులు డిప్యుటేషన్‌పై జిల్లా కార్యాలయానికి వచ్చారు. అయితే వారు ఎప్పుడు ఎక్కడ ఉంటారో కూడా తెలియని పరిస్థితి. ఇక ఓ ప్రాజెక్టు అధికారి క్యాంపులపై వెళితే అందులో పనిచేసే కొంతమంది ఉద్యోగులతో తమ సొంత పనులను చక్కబెట్టుకుంటున్నట్లు విమర్శలున్నాయి. వీరిలో చాలా మందికి డిప్యుటేషన్ ఉత్తర్వులు ఇవ్వకుండానే నోటిమాట ద్వారా పనిచేస్తున్నట్లు తెలుస్తుంది. ఈ డిప్యుటేషన్ల వ్యవహారంలో అధికారులు పెద్ద మొత్తంలో నగదు తీసుకున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. వీటిని రద్దు చేస్తూ 2021లోనే ఉత్తర్వులు వచ్చాయి. అయితే అప్పట్లో డిప్యుటేషన్లపై పెద్ద దుమారమే రేగింది. అత్యవసర పరిస్థితిలో కలెక్టర్ అనుమతితోనే డిప్యుటేషన్లు అమలు చేయాల్సి ఉంది. అయితే ప్రస్తుతం ఈ ప్రక్రియ ఇష్టారాజ్యంగా జరిగినట్లు సమాచారం.



డిప్యూటేషన్లు ఏమి లేవు..

వైద్య ఆరోగ్యశాఖలో డిప్యుటేషన్లు ఏమీ లేవు. ప్రస్తుతం డిప్యుటేషన్‌లో ఉన్న ఉద్యోగులను కలెక్టర్ అనుమతి తోనే నియమించాం. కమిషనర్ నుంచి తాజాగా వచ్చిన ఆదేశాలకు అనుగుణంగా నివేదిక ఇస్తాం.

- డీఎంహెచ్‌వో డాక్టర్ పెంచలయ్య

పరిమితంగానే అమ్మకాలు !

- గత ఏడాది గణాంకాల ఆధారంగా మద్యం షాపుల్లో విక్రయాలు
- టార్గెట్ పూర్తి కాగానే దుకాణం బంద్
- బార్లలోనూ సేల్స్ నిలుపుదలకు యత్నాలు ?
- ఎన్నికల నేపథ్యంలో ఎక్సైజ్‌శాఖ చర్యలు
- విచ్చలవిడిగా 'బెల్టు'

నెల్లూరు(క్రైం), ఏప్రిల్ 7: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో మద్యం దుకాణాల్లో కొత్త నిబంధనలు అమలవుతున్నాయి. ఉదయం 11 గంటలకు మద్యం దుకాణం తెరిచి, రాత్రి 9 గంటలకు మూసేయాల్సి ఉంది. అయితే కొద్ది రోజులుగా జిల్లాలోని పలు ప్రాంతాల్లో మద్యం దుకాణాలు సమయానుసారంగా పనిచేయడం లేదు. ముందుగానే దుకాణాలను మూతేస్తున్నారు. స్వాతంత్ర్య దినోత్సవం, రిపబ్లిక్ డే, గాంధీ జయంతి తదితర జాతీయ పర్వదినాలు లేవుకదా... ఎన్నికలకు ఇంకా గడువు ఉంది కదా...? ముందుగా మద్యం దుకాణాలను ఎందుకు మూసేస్తున్నారబ్బా.. అని మందుబాబులు తలపట్టుకుంటున్నారు. ఈ విషయమై సర్వత్రా చర్చ సాగుతోంది.

● విక్రయాలకు పరిమితులు

ఎన్నికల నేపథ్యంలో మద్యం పక్కదారి పడుతోందన్న ఆలోచనతో జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు, ప్రభుత్వ దుకాణాల్లో మద్యం అమ్మకాలకు ఎక్సైజ్ శాఖ పరిమితులు విధించింది. గత ఏడాది ఏప్రిల్‌లో ప్రతి దుకాణంలోని అమ్మకాల లెక్కలు చూసి ఎక్సైజ్ అధికారులు వాటి ఆధారంగా ఈ ఏడాది కూడా విక్రయాలు చేయాలని నిబంధనలు విధించారు. ఉదాహ రణకు ఓ దుకాణం గత ఏడాది ఏప్రిల్‌లో రూ.1.50 కోట్ల మేరకు అమ్మకాలు చేసుంటే, ప్రస్తుతం ఆ దుకాణంలో రోజుకు రూ.5లక్షల మద్యం అమ్మకాలు చేయాలి. రూ.5లక్షల విక్రయాలు పూర్తయ్యాక దుకాణం మూసేయాల్సి ఉంటోంది. జిల్లా వ్యాప్తంగా ఈ పరిమితులతోనే మద్యం అమ్మకాలను సాగిస్తున్నారు. బార్లలో మాత్రం ఈ నిబంధనలు ఇంకా అమల్లోకి రాకపోయినా, కొద్ది రోజుల్లో అమలవుతాయని అధికారులు తెలియచేస్తున్నారు. అయితే పరిమితులతో అమ్మకాలు సాగించి, మద్యం దుకాణాలు మూసివేస్తుండ డంతో మందుబాబులకు ఇబ్బందులు తప్పవని ఎక్సైజ్ అధికారులు గుర్తించారు. దీంతో విక్రయాలను మరో 20 శాతం పెంచేలా చర్యలు చేపడుతున్నారు.



నెల్లూరు నగరంలోని ట్రంకురోడ్డులో మూసి ఉన్న మద్యం దుకాణం

● విచ్చలవిడిగా బెల్టు షాపులు

మద్యం అమ్మకాలపై అధికారులు నిబంధనలు విధించడంతో మందుబాబులు ఇబ్బందులు పడుతున్నారు. దీంతో ఆయా ప్రాంతాల్లో బ్లాక్‌లో మద్యం కొనేందుకు, బార్లకు వెళ్లేందుకు వారు ఆసక్తి చూపుతున్నారు. ఈ విషయాన్ని గమనించిన పలువురు ప్రభుత్వ మద్యం దుకాణాల సిబ్బంది ముందుగానే మందును కొనుగోలు చేసి, దుకాణాలు మూసేశాక బెల్ట్ దుకాణాలు ఓపెన్ చేసి అధిక ధరలకు విక్రయిస్తున్నారు. అంతేకాక ప్రభుత్వ మద్యం దుకాణాలకు పక్కనే ఉన్న శీతలపానియాల దుకాణాలను వ్యాపారులు బెల్ట్ దుకాణాలుగా మార్చేస్తున్నారు. స్థానిక పోలీసులు, సెబ్ అధికారులు, సిబ్బంది మామూళ్ల మత్తులో మునుగుతూ వాటి వైపు కన్నెత్తి చూడడం లేదు.

టీడీపీని వీడే ప్రసక్తే లేదు..

- వైసీపీలో చేరుతున్నట్లు తప్పుడు ప్రచారాలు
- విలేకరులతో వేమిరెడ్డి దంపతులు



విలేకరులతో మాట్లాడుతున్న వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి దంపతులు

నెల్లూరు (హరనాథపురం), ఏప్రిల్ 7: వైసీపీలో చేరుతున్నట్లు తమపై సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని, తాము తెలుగుదేశం పార్టీని వీడే ప్రసక్తే లేదని వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, ప్రశాంతిరెడ్డి దంపతులు స్పష్టం చేశారు. ఆదివారం నెల్లూరులోని వారి స్వగృహంలో విలేకరులతో మాట్లాడారు. టీడీపీలో మాకు గౌరవం ఉంది. తాము టీడీపీని వీడుతున్నట్లు ఇటీవల సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం చేస్తున్నారు. ఇది కావాలని చేస్తున్న ప్రచారమని వారు పేర్కొన్నారు. తెలుగుదేశం పార్టీ తరపున సైకిల్ గుర్తుపై పోటీ చేసి అత్యధిక మెజార్టీతో తాము గెలుపొందుతామన్నారు. తమకు వస్తున్న విశేష ఆదరణను చూసి తట్టుకోలేక, వైసీపీ నుంచి భారీగా టీడీపీలో చేరుతున్నారని, దాన్ని జీర్ణించుకోలేక అసత్య ప్రచారాలు చేస్తున్నారని వారు ఆరోపించారు. తమపై నమ్మకం పెట్టుకున్న ప్రజలను తప్పుదోవ పట్టించడానికి ఈ ప్రచారాలు చేస్తున్నారని వారు వివరించారు. తమ విజయం మీద ఎలాంటి అనుమానం లేదని, ప్రజల నుంచి వస్తున్న స్పందనే అందుకు నిదర్శనమని వీపీఆర్ దంపతులు చెప్పారు.

పాట.. ప్రచారంలో తూటా !

- ప్రజల్ని ఆకట్టుకుంటున్న గీతాలు
- పార్టీ, వ్యక్తుల పేర్లతో లిరిక్స్
- సిద్ధాంతాలు, మేనిఫెస్టో అంశాలతో సాంగ్స్
- జనాన్ని ఆకర్షిస్తున్న నేతలు

పొదలకూరు, ఏప్రిల్ 7: వచ్చే సార్వత్రిక ఎన్నికల కోసం వివిధ రాజకీయ పక్షాల నాయకులు ఇప్పటికే ప్రచారంలో మునిగి తేలుతున్నారు. అన్ని పార్టీలు కూడా తమ ప్రచారంలో పాటలను తప్పనిసరి చేశాయి. పార్టీలే కాకుండా, అభ్యర్థులు కూడా సొంతంగా పాటలు రాయించుకుంటున్నారు. తమ పేర్లు, పార్టీ గుర్తు, చేసిన పనులను గుర్తు చేస్తూ లిరిక్స్ రాయిస్తున్నారు. వాటిని మ్యూజిక్ డైరెక్టర్ల ఆధ్వర్యంలో రికార్డు చేయించి ప్రచార రథాల్లో వినియోగించుకుంటున్నారు.

● కొన్ని పాటలు హిట్

కొన్ని పాటలు క్యాచీగా ఉంటుండడంతో సినిమా పాటల స్థాయిలో హిట్ అవుతున్నాయి. యూట్యూబ్, సోషల్ మీడియాలో ప్రచారం పాటలు కూడా ట్రెండింగ్‌గా మారుతున్నాయి. దీంతో వెంటనే ఆ పాటలకు పేరడీలు, కౌంటర్ సాంగ్స్, జానపద గేయాలు కూడా తెరపైకి వస్తున్నాయి. ఈ ప్రచార పాటల పోటీ తో కొత్త కవులు, రచయిత లకు, సింగర్స్‌కు అవకాశాలు దొరుకుతున్నాయి. గత ఎన్నికల్లో వైసీపీ రూపొందించిన 'రావాలి జగన్.. కావాలి జగన్'... అనే పాట జనాదరణ పొందింది. బలిరా బలిరా.. సాంగ్, టీడీపీ 'తిప్పరా మీసం.. ఇది ఆంధ్రుని రోషం'.. 'రా రమ్మని పిలుస్తోంది తెలుగుదేశం'.. అనే గీతాలు ఎంతో బాగా వైరల్ అయ్యాయి. జగన్‌ను గద్దె దించడమే లక్ష్యంగా బరిలోకి దిగుతున్నామని చెబుతున్న టీడీపీ వైసీపీ టార్గెట్ చేసుకుని గూస్‌బంప్స్ వచ్చే సాంగ్‌ను రిలీజ్ చేసింది. 'రా కదలిరా'.. అంటూ జగన్‌పై విమర్శల బాణాలు ఎక్కు పెట్టింది. అలాగే పరుశురాముడు వచ్చినాడురో సూడన్నా... ప్రజల కొరకు నిలిచినాడురో పవనన్నా.. సింహమై కదిలి నాడురో మా యన్నా.. గాజు గ్లాసుకు ఓటు వేయరో పెద్దన్న!!.. అంటూ సాగే జనసేన ఎన్నికల ప్రచారగీతం అందరినీ ఆకట్టుకుంటోంది.



● పాటలతో ఆకట్టుకుంటూ...

ఒక పాట ఎన్నో వేల మాటలకు మించిన భావాన్ని వ్యక్తం చేస్తుంది. విషయం సూటిగా చేరేలా చేస్తుంది. అలాంటి పాటను అభ్యర్థులు ప్రచారంలో వినియోగిస్తూ ఓటర్లను ఆకట్టుకుంటున్నారు. లక్షల్లో వ్యూస్ కూడా వస్తుండడంతో అభ్యర్థులు మరిన్ని పాటలతో ఓటర్ల ముందుకు వస్తున్నారు. గతంలో గోడలపై రాతలు, కరపత్రాలు పంచడం లాంటి వాటిపై ఎక్కువ దృష్టి పెట్టే వారు. డిజిటల్ యుగంలో ప్రచార వ్యూహాలు మారుతు న్నాయి. ఆకట్టు కునే పాటలతో సోషల్ మీడియా వేదికగా ప్రచారం చేస్తున్నారు. ప్రధాన పార్టీలు కళాకారులతో ప్రత్యేక గీతాలను రికార్డు చేయించి, వాటిని అభ్యర్థులకు అందిస్తున్నాయి. దీంతో పలువురు కళాకా రులకు ఉపాధి దొరు కుతున్నది. బాణీల నుంచి పాట రూపకల్పనకు ఒక్కో పాటకు రూ.20వేల నుంచి రూ.లక్ష వరకు చెల్లిస్తున్నారు. ఎమ్మె ల్యేలు, ఇతర ప్రముఖులు కూడా వారి వారి పేర్లతో పాటలు రాయిం చుకుని పాట పాడిస్తుండడంతో ఈ రంగంలోనూ పోటీ పెరిగిపోయిందని పలువురు అంటున్నారు.

డ్రైవర్లకు వేతన బకాయిలు !

● ఆగిన క్లాప్ ఆటోలు ● చెత్తమయమవుతోన్న కావలి

కావలి, ఏప్రిల్ 7: క్లాప్ ఆటోల డ్రైవర్లకు జీతాలు ఇవ్వకపోవడంతో వారు ఆటోలను తిప్ప కుండా కావలి పట్టణంలోని బాపూజీ నగర్‌లోని మున్సిపల్ పార్కులో ఓవర్‌హెడ్ ట్యాంకు వద్ద నిలిపివేశారు. పారిశుధ్యం మెరుగుకు స్వచ్ఛసర్వేక్షణ పేరుతో కేంద్ర, రాష్ట్రాలు పలు ప్రాజెక్టులు చేపట్టినా ఆచరణలో అవి సక్రమంగా అమలుకాక నవ్వులు పాలవుతున్నాయి. ఆ ప్రాజెక్టులు విఫలమై పట్టణంలో పారిశుధ్యం క్షీణిస్తోంది. రాష్ట్ర ప్రభుత్వం చెత్త సేకరణ కోసం క్లాప్ ఆటోలను ప్రవేశపెట్టి కావలి మున్సిపాల్టీకి తొలివిడతగా 6 ఆటోలు ఇచ్చింది. ఆ ఆటోలు నిర్వహణ బాధ్యత కాంట్రాక్టర్‌కు అప్పగించడంతో ఆయన మున్సిపాల్టీలో వాటిని తిప్పి చెత్త సేకరించినందుకు ఆ కాంట్రాక్టర్‌కు మున్సిపాల్టీ బిల్లులు చెల్లిస్తోంది. ఆ బిల్లులతో కాంట్రాక్టర్ దానిని నడిపే డ్రైవర్లకు జీతాలు ఇస్తారు.



బాపూజీనగర్ మున్సిపల్ పార్కులో నిలిపిన క్లాప్ ఆటోలు

ఈ ప్రాజెక్ట్ ద్వారా సత్ఫలితాలు పొందాలని తొలుత మున్సిపల్ కమిషనర్ పట్టణంలో వార్డులో క్లాప్ ప్రోగ్రామ్‌లు పెట్టి తడి చెత్త, పొడిచెత్త వేరు చేసి ఆటోలకు ఇవ్వాలని చెప్పారు. ఆ ఆటోలలో కూడా తడిచెత్త పొడిచెత్తకు వేరువేరుగా రెండు అరలు ఉన్నాయి. ఆ ఆటోలను నిర్వహించే కాంట్రాక్టర్‌కు ఇచ్చే బిల్లు భారం మున్సిపల్ ఆర్థికపరిస్థితిపై పడకుండా ప్రజల నుంచి చెత్త పన్ను వసూలు చేసి తద్వారా వారికి చెల్లించేట్లుగా కొంత కాలం కొనసాగించారు. చెత్త పన్ను చెల్లించేందుకు ప్రజలు నిరాకరించడం, ప్రభుత్వంపై తీవ్ర వ్యతిరేకత రావడంతో దశలవారీగా చెత్తపన్ను వసూలు నిలిపివేశారు. దీంతో మున్సిపాల్టీ కూడా ఆ కాంట్రాక్టర్‌కు బిల్లులు చెల్లింపును నిలిపివేసింది. బిల్లులు లేనందున కాంట్రాక్టర్ వాటిని నడిపే డ్రైవర్లుకు జీతాలు నిలిపి వేశారు. దీంతో ఆటోల డ్రైవర్లు కొంత కాలం ఆందోళన చేసినా ప్రయోజనం లేక పోవటంతో వారు తమ విధులను వదిలి వేశారు. వెరశి క్లాప్ ఆటోలు నిరుపయోగంగా వదిలేశారు. దీంతో అవి పాడైపోవటమేకాక చెత్త సేకరణలో కూడా మున్సిపాల్టీకి ఇబ్బందులు తప్పటంలేదు.

అడిగేవారు.. అడ్డుకునేవారు ఏరీ ?

పేదల భూముల్లో గ్రావెల్ దందా

● వైసీపీ నేతల బరితెగింపు
● వందలాది టన్నుల తరలింపు, రూ. కోట్లలో దోపిడీ
● మామూళ్ల మత్తులో అధికార యంత్రాంగం



పేదల భూముల నుంచి గ్రావెల్ తరలించిన ఆనవాళ్లు



భారీ స్థాయిలో గ్రావెల్ తరలింపునకు నిదర్శం ఈ హద్దురాయే !

సంగం, ఏప్రిల్ 7: అడిగే వారు.. అడ్డుకునేవారు లేకపోవడంతో వైసీపీ నేతలు బరితెగించారు. పేదల భూముల్లో గద్దల్లా వాలిపోయారు. రాత్రీపగలు తేడాలేకుండా యంత్రాలతో గ్రావెల్‌ను ఇష్టారాజ్యంగా తరలించారు. రూ. కోట్లను జేబులు వేసుకున్నారు. అధికారపార్టీ నేతల బెదిరింపులతో పేదలు ప్రశ్నించలేని పరస్థితి. అడ్డుకోవాల్సిన అధికార యంత్రాంగం మామూళ్ల మత్తులో మునిగారు. దీంతో వైసీపీ నేతల అక్రమార్జనకు అడ్డే లేకుండా పోయింది. వివరాల ల్లోకి వెళితే..సంగం మండలంలోని కొరిమెర్ల పంపింగ్ స్కీమ్‌కు సమీపంలో ఉత్తరం వైపు సంగం కొండ రిజర్వ్‌డ్ ఫారెస్ట్‌కు దిగువన ఉన్న ప్రభుత్వ భూమిని గతంలో సంగం గ్రామానికి చెందిన కొంతమంది పేదలకు ఒక్కొక్కరికి 0.80 సెట్ల చొప్పున ప్రభుత్వం పంపిణీ చేసింది. సుమారు 80 ఎకరాలను 80 మంది ఎస్సీ, ఎస్టీ, బీసీలకు పంపిణీ చేసింది. అయితే ఆ భూములకు నీటివసతి లేకపోవడం, ముళ్ల పొదలతో నిండి ఉండడం, లబ్ధిదారులంతా పేదలు కావడంతో సాగుకు నోచుకోలేదు. ఏళ్ల తరబడి బీడుగా ఉంది. అయితే ఈ భూముల్లో విలువైన గ్రావెల్ ఉండడంతో వైసీపీ నేతల కన్ను పడింది. అంతే.. ఇంకేముంది గద్దల్లా అక్కడ వాలిపోయారు.

● యథేచ్ఛగా గ్రావెల్ తరలింపు

వైసీపీ నేతలు అధికారం ఉందనే అహంకారంతో బరితెగించారు. యంత్రాలు పెట్టి టిప్పర్లతో గ్రావెల్‌ను యథేచ్ఛగా తరలించారు. ఇటు బుచ్చి, నెల్లూరు, అటు ఆత్మకూరు వైపు కుప్పలు తెప్పలుగా వెలసిన లేఅవుట్లకు గ్రావెల్‌ను తరలించి రూ. కోట్లను జేబులో వేసుకున్నారు. కొన్నాళ్ల నుంచి ఈ తతంగం జరుగుతుంది. సుమారు రూ. 5 నుంచి రూ. 6 కోట్ల విలువైన గ్రావెల్ తరలించినట్లు పేదల భూములను చూస్తే తెలిసిపోతుంది. అధికారపార్టీ నేతలను పేదలు ప్రశ్నించలేక, అడ్డుకోలేక మిన్నకుండిపోయారు. ఎవరైనా ప్రశ్నిస్తే బెదిరింపులు, కేసులతో వేధిస్తున్నారు.

● ఫిర్యాదు చేస్తే క్షణాల్లో సమాచారం

ప్రతిపక్ష నాయకులు, ఇతరులు ఎవరైనా గ్రావెల్ అక్రమ తరలింపుపై అధికారులకు ఫిర్యాదు చేస్తే క్షణాల్లో నిర్వాహకులకు తెలిసిపోతుంది. అధికారులు తనిఖీకి వచ్చే లోపు అక్కడ వాహనాలేవి కనిపించవు. యంత్రాలను దాచేస్తారు. మొదట్లో పగలు, రాత్రి తేడా లేకుండా గ్రావెల్ తరలించే అక్రమార్కులు, ఎన్నికల కోడ్ వచ్చినప్పటి నుంచి రాత్రుళ్లు మాత్రమే తమ కార్యకలాపాలు సాగిస్తున్నారు. గ్రావెల్ అక్రమ తరలింపుపై శనివారం కొందరు జిల్లా కలెక్టర్ ఫిర్యాదు చేయడంతో అధికారులు టిప్పర్లను స్వాధీనం చేసుకున్నారు. కానీ అక్కడున్న యంత్రాలను పట్టించుకోలేదు.

● మామూళ్ల మత్తులో తూలుతూ...

నిన్నటివరకు పట్ట పగలే జాతీయ రహదారిపై గ్రావెల్ టిప్పర్లు తిరుగుతున్నా స్థానిక పోలీసులుగానీ, రెవెన్యూ యంత్రాంగం కానీ, మైనింగ్, సెబ్ అధికారులు కన్నెత్తి చూసిన దాఖలాలు లేవు. దీంతో అధి కార యంత్రాంగం తీరుపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. మామూళ్ల మత్తులో అధికారులు తూలుతున్నారని ప్రతిపక్ష పార్టీ నాయకులు బహిరంగంగా ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు చిత్తశుద్ధితో వ్యవహరించి గ్రావెల్ దందాను అరికట్టాలని పేదలు కోరుతున్నారు.

నెలకు కోటిన్నరపైనే...

పేదల భూముల్లో రెండు యంత్రాలు పెట్టి నిత్యం 15 టిప్పర్లతో గ్రావెల్ తరలిస్తున్నారు. ఒక్కొక్క టిప్పర్ రోజుకు ఐదు లోడ్లు తరలిస్తున్నారు. ఒక టిప్పర్ గ్రావెల్ లోడు రూ. 7,000లు లెక్కన విక్రయిస్తున్నారు. ఈ లెక్కన ఒక టిప్పరతో ఐదు లోడ్లు తరలిస్తే రోజుకు రూ. 35,000లు 15 టిప్పర్ల ద్వార రోజుకు సుమారు రూ. 5 లక్షలపైమాటే. ఈ లెక్కన నెలకు కోటిన్నర విలువలైన గ్రావెల్ తరలించి అక్రమార్కులు సొమ్ము చేసుకుంటున్నారు. సుమారు నాలుగు నుంచి రూ. 6 కోట్లపైగా జేబులు నింపుకుంటున్నారు.

అభివృద్ధి చేసిన నేనెక్కడ.. ఏమీ చేయని మీరెక్కడ ?

● ముఖ్యమంత్రి ఆర్భాటపు ప్రచారాలతో ప్రజాధనం వృథా
● మాజీ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి
● ఆత్మకూరు ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డిపై తీవ్ర విమర్శలు



మర్రిపాడులో మాట్లాడుతున్న ఆనం రామనారాయణరెడ్డి

మర్రిపాడు, ఏప్రిల్ 7: సోమశిల హైలెవెల్ కెనాల్ నిర్మాణానికి తక్కువ సమయంలో రూ.1600 కోట్లు నిధులు మంజూరు చేయించి, టెండర్లు పిలిచి పనులు ప్రారంభించిన నేనెక్కడ.. 10ఏళ్ల అధికారాన్ని అనుభవించి నాలుగు డ్యామ్‌ల్లో ఒక్క డ్యామ్ నిర్మాణాన్ని కూడా పూర్తి చేయలేని మీరెక్కడ? అంటూ ఆత్మకూరు ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డిపై మాజీ మంత్రి, ఆత్మకూరు టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఆనం రామ నారాయణరెడ్డి మండిపడ్డారు. ఆదివారం మర్రిపాడులోని మాజీ ఎమ్మెల్యే మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి నివాసంలో ఆయన మండలస్థాయి టీడీపి నాయకుల ఆత్మీయ సమావేశంలో పాల్గొని మాట్లాడారు. టీడీపీ ప్రభుత్వంలో 80లక్షల రేషన్‌కార్డులుంటే వైసీపీ పాలనలో 63లక్షలకు తగ్గించారంటూ, అప్పుడు ఒక్కో కార్డుకు 8రకాల సరుకులు ఇచ్చేవారని.. ఇప్పుడు కేవలం బియ్యానికే పరిమితం చేశారని ఎద్దేవా చేశారు.

సీఎం జగన్‌పై తీవ్ర విమర్శలు

ఎన్నికల ముందు ప్రతిరైతుకు రైతుభరోసా పథకంతో రూ.13వేలు స్వంతంగా ఇస్తానని చెప్పి, ఇప్పుడు కేంద్రం ఇస్తున్న రూ.7వేలను కలుపుకొని రూ.13,500 ఇవ్వటం రైతులను మభ్య పెట్టటం కాదా? అని ప్రశ్నించారు. 94పథకాలకు కేంద్రం నిధులు ఇస్తుంటే వాటికి 10శాతం, 20శాతం రాష్ట్ర ప్రభుత్వ వాటా ఇవ్వలేక 70పథకాలను రద్దు చేశావు అని సీఎం జగన్‌పై మండిపడ్డారు. చంద్రబాబునాయుడు 16లక్షల మంది విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇస్తే జగన్‌రెడ్డి హయాంలో 9లక్షల మందికి మాత్రమే ఇచ్చాడ గుర్తుచేశారు. విజయసాయిరెడ్డి, సజ్జల రామకృష్ణారెడ్డి, పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, అవినాష్‌రెడ్డి, మిథున్‌రెడ్డి ల కనుసన్ననలో చీపు లిక్కర్ తయారు చేసి, ఏడాదికి లక్ష కోట్లు, ఇసుక ద్వారా రూ.50వేల కోట్లు దోచుకున్నావని తెలిపారు. నీ వికృత చేష్టలు.. నీ రక్తం పంచుకు పుట్టిన నీ చెల్లెలే బయట పెడుతుంటే ఆమెతో చంద్రబాబు మాట్లాడిస్తున్నాడు అని అనడం ఎంతవరకు సమంజసం అన్నారు. రానున్న ఎన్నికల్లో ప్రజలే తగిన బుద్ధి చెబుతారని, ఈ ఎన్నికల్లో విజయ బావుటా ఎగురవేస్తామని మాజీ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, మాజీ ఎమ్మెల్యే మేకపాటి చంద్రశేఖర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కొమ్మి లక్ష్మయ్యనాయుడు, మాజీ ఎమ్మెల్యే కంభం విజయరామిరెడ్డిలు ఒకేవేదికపై నినాదాలు చేశారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి శాంతమ్మ, టీడీపి యువ నాయకులు తాళ్లూరి గిరి నాయుడు, మండలాధ్యక్షుడు ఆరికట్ల జనార్దన్ నాయుడు పాల్గొన్నారు.

ఇంగ్లాండ్ జార్జ్‌రెడ్డి!

● బుల్లెట్ వాహన ప్రియుడు పోవో
● 4నెలల్లో 11దేశాల్లో 18వేల కిలోమీటర్ల ప్రయాణానికి పయనం
● చెన్నై నుంచి యాత్రకు శ్రీకారం..
● సంగం-ముంబాయి రోడ్డులో కంటపడ్డ విదేశీయుడు



బుల్లెట్ వాహనంపై ప్రయాణం చేస్తున్న ఇంగ్లాండ్ వాసి

సంగం, ఏప్రిల్ 7: నీవు నడిపే బండీ.. రాయల్ ఎన్‌ఫీల్డ్.. నీ చేతల్లో ఉందీ చెగువేరా ట్రెండ్.. అని కొన్నేళ్ల కిందట జార్జిరెడ్డి అనే తెలుగు సినిమాలో ఈ పాటను అందరూ వినే ఉంటారు. కానీ 56ఏళ్ల ఇంగ్లాండ్‌వాసి పోవో బుల్లెట్ మోటార్ బైక్‌పై (రాయల్ ఎన్‌ఫీల్డ్) ఆదివారం సంగం - ముంబాయి జాతీయ రహదారిపై కనిపించాడు. అతడిని ఆంధ్రజ్యోతి పలకరించగా పలు ఆసక్తికర విషయాలు తెలిపాడు. వృత్తిరీత్యా ఆర్కిటెక్ అయిన పోవో రాయల్ ఎన్‌ఫీల్డ్ ద్విచక్ర వాహనం అంటే అమితమైన ప్రేమ. ఆ మోజుతో ఆయన వాహనాన్ని స్వదేశం నుంచి విమానంలో పార్శిల్ చేశాడు. ఇంగ్లాండ్ నుంచి చెన్నై వచ్చిన ఆయన ఉదయం అక్కడినుంచి బయలుదేరి కడప వైపు వెళ్తున్నాడు. 18వేల కిలోమీటర్ల దూరం ప్రయాణం చేయడానికి శ్రీకారం చుట్టాడు. ఇండియా, చైనా, ఉజ్బెకిస్థాన్, టర్కీ వంటి 11దేశాల్లో నాలుగు నెలల్లో 18వేల కిలోమీటర్లు ప్రయాణం చేయనున్నాడు. ఈ ప్రయాణంలో ప్రముఖ కట్టడాలు, చారిత్రాత్మక ప్రదేశాలను తిలకించనున్నట్లు తెలిపారు. ఇండియా, ఇంగ్లాడ్ దేశాల మధ్య ఐక్యమత్యం వర్ధిల్లాలని తన ఆకాంక్షని తెలిపాడు.

వారధులుగా సెక్టోరల్ అధికారులు

● పోలింగ్ నిర్వహణపై అప్రమత్తత అవసరం
● ఈవీఎంల కమిషనింగ్ చాలా ప్రధానం
● జిల్లా ఎన్నికల అధికారి హరినారాయణన్



హాజరయిన అధికారులు, మాట్లాడుతున్న జిల్లా ఎన్నికల అధికారి హరినారాయణన్

ఆత్మకూరు, ఏప్రిల 7: ఎన్నికల రిటర్నింగ్ అధికారులు, పోలింగ్ అధికారులకు..సెక్టోరల్ అధికారులు వారధిగా ఉండి విధులు నిర్వర్తించేలా చూడాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ హరినారాయణన్ తెలిపారు. ఆత్మకూరులోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఆత్మకూరు, ఉదయగిరి నియోజకవర్గాల సెక్టోరల్ అధికారులకు పోలింగ్‌కు ముందు, పోలింగ్ రోజు నిర్వహించాల్సిన విధులపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. నోటిఫికేషన్ జారీ అయినప్పటి నుంచి పోలింగ్ ప్రక్రియ ముగిసే వరకు సెక్టోరల్ అధికారులు అప్రమత్తంగా తమ విధులు నిర్వహించాలన్నారు. పీవో, ఏపీవో శిక్షణా కార్యక్రమాలకు తప్పనిసరిగా పర్యవేక్షించాలన్నారు. ఈవీఎంల కమిషనింగ్‌పై పూర్తిస్థాయి అవగాహన కలిగి ఉండాలని సూచించారు. డోర్ టు డోర్ ఓటరుకు వివరాలు తెలిపే స్లిప్పులను బూత్ లెవల్ అధికారులతో అందించే బాధ్యత వారిదే అన్నారు. మే 8నాటికి అన్ని ఓటరు స్లిప్పులను ఆర్వోకు అందించాల్సి ఉందన్నారు. ఎన్నికల ప్రక్రియకు కావాల్సిన ఏర్పాట్లలో ఎలాంటి లోటుపాట్లు లేకుండా ముందుగానే పూర్తి చేసుకునేలా సన్నద్ధం చేయాలని ఆదేశించారు. అందరూ సమన్వయంతో పనిచేసి జిల్లాలో ప్రశాంతంగా పోలింగ్ ప్రక్రియ ముగిసేలా తమ వంతు కృషిచేయాలని సూచించారు. సమావేశంలో ఆత్మకూరు, ఉదయగిరి అసెంబ్లీ నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారులు కె మధులత, ప్రేమ్‌కుమార్ పాల్గొన్నారు.

ఎన్నికల నిర్వహణకు సిద్ధంగా ఉండాలి

● అధికారుల సమన్వయ సమావేశంలో ఎస్పీ ఆరీఫ్ హాఫీజ్



మాట్లాడుతున్న ఎస్పీ ఆరీఫ్ హాఫీజ్

నెల్లూరు(క్రైం), ఏప్రిల్ 7: స్వేచ్ఛాయుత వాతావరణంలో, న్యాయబద్ధంగా సార్వత్రిక ఎన్నికల నిర్వహణకు అందరూ సిద్ధంగా ఉండాలని పోలీసు అధికారులకు ఎస్పీ కే ఆరీఫ్ హాఫీజ్ దిశానిర్దేశం చేశారు. ఇటీవల బాధ్యతలు చేపట్టిన ఎస్పీ నెల్లూరులోని ఉమేష్‌చంద్ర కాన్ఫరెన్స్ హాల్‌లో ఆదివారం జిల్లాలోని పోలీసు అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎన్నికల నియమ నిబంధనలకు అనుగుణంగా నిష్పక్షపాతంగా విధులు నిర్వహించాలన్నారు. ఎన్నికల కోడ్ అమలు, పాటించాల్సిన నియమాలు, ముందస్తుగా చేపట్టాల్సిన చర్యలపై అధికారులకు పలు సూచనలు చేశారు. ప్రజలకు భద్రత, భరోసా కల్పిస్తూ ఈవ్ టీజింగ్, నేరపూరిత కార్యక్రమాలు జరగకుండా కట్టడి చేసేందుకు విజిబుల్ పోలీసింగ్ నిర్వహించాలన్నారు. నగదు, మద్యం, ఇతర వస్తువుల అక్రమ రవాణా అడ్డుకట్టకు వాహనాలను ముమ్మరంగా తనిఖీ చేయాలని ఆదేశించారు. అధికారులు గ్రామాలను సందర్శించి గ్రామ పెద్దలు, ప్రజలతో మమేకమై ఎన్నికల ప్రవర్తన నియమావళిపై అవగాహన కల్పించాలన్నారు. 112, ఎలక్షన్ సంబంధిత ఫిర్యాదులపై తక్షణమే స్పందించి చట్టపరమైన చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీలు సీహెచ్ సౌజన్య, ఏవీఆర్‌పీబీ ప్రసాద్, శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

సమస్యాత్మక గ్రామాలపై దృష్టి పెట్టండి : ఎస్పీ

మనుబోలు: సమస్యాత్మక గ్రామాలపై దృష్టి పెట్టి, ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా చర్యలు తీసుకోవాలని జిల్లా ఎస్పీ ఆరీఫ్ హాఫీజ్ సూచించారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో జిల్లా సరిహద్దు ప్రాంతమైన బద్దెవోలు క్రాస్‌రోడ్డులో ఏర్పాటుచేసిన చెక్‌పోస్టును ఆదివారం రాత్రి ఆయన తనిఖీ చేశారు. సిబ్బంది చేస్తున్న వాహనాల తనిఖీలను ఆయన పరిశీలించారు. తనిఖీలకు వాహనదారులు సహకరించాల న్నారు. వివాదాస్పద వ్యక్తులను బైండోవరు చేయాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో ఎస్బి ఇన్‌స్పెక్టర్ రామకృష్ణారెడ్డి, డిఎస్పీ వీరాంజనేయరెడ్డి, సీఐ రాంబాబు, ఎస్ఐ అజయ్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

నేటి నుంచి ఓటు హక్కు చైతన్యయాత్ర

నెల్లూరు (సాంస్కృతికం): భారత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో సోమవారం నుంచి నగరంలో ఓటు హక్కు చైతన్య ప్రచారయాత్ర చేపడుతున్నట్లు ఆ ఫౌండేషన్ ప్రధాన కార్యదర్శి ఎస్‌కే ఖాసిం, అధ్యక్షుడు డాక్టర్ కే రాజశిరోమణి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమం ప్రతిరోజు ఉదయం 6 నుంచి 8గంటల వరకు, సాయంత్రం 6 నుంచి 8గంటల వరకు జరుగుతుందన్నారు. 18 ఏళ్లు నిండిన యువతీ యువకులు ఈనెల 14లోపు ఓటర్లుగా నమోదు చేసుకోవాలని కోరారు. ఓటు హక్కు కావాల్సిన వారితో సమీప సచివాలయాల్లో దరఖాస్తు చేయించేం దుకు తమ ఫౌండేషన్ కృషి చేస్తుందని తెలిపారు.

మేతకు వెళ్లి పది మేకల మృతి



మృతి చెందిన మేకలను చూపుతున్న బాధిత రైతు


అనంతసాగరం, ఏప్రిల్ 7: బొమ్మవరం పంచాయతీలోని గోగులపల్లి బద్దల మల్లికార్జున్‌కు చెందిన 10మేకలు ఆదివారం మృతి చెందాయి. రోజు మాదిరిగా గ్రామ సమీపంలోని చెరువులో మేతకు తోలానని కాసేపటి తరువాత వెళ్లి చూడగా పది మేకలు మృతి చెంది ఉన్నట్లు మేకల యజమాని వాపోయాడు. మేకల మృతితో తనకు రూ.2లక్షల నష్టం వాటిలినట్లు ఆవేదన వ్యక్తం చేశాడు. ఈ విషయం పశువైద్య సిబ్బందికి తెలపడంతో వారు మేకలను పరిశీలించారు. విషగుళికలు తినడం వల్లే మృతి చెంది ఉంటాయని తెలిపారు.

రైలు ఢీకొని గుర్తుతెలియని యువకుడి దుర్మరణం

నెల్లూరు(క్రైం), ఏప్రిల్ 7: నెల్లూరులోని వేదాయపాలెం రైల్వే స్టేషన్ వద్ద ఆదివారం రైలు ఢీకొని గుర్తుతెలియని యువకుడు మృతి చెందాడు. సమాచారం అందుకున్న రైల్వే ఎస్ఐ జీ మాలకొండయ్య ఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. 25 నుంచి 30 ఏళ్ల మధ్య వయస్కుడు మృతి చెందాడని, మృతదేహంపై నలుపురంగు హాఫ్ హాండ్స్ టీ షర్టు, నలుపు రంగు షార్ట్ ఉన్నాయని, కుడిచేతిపై మోహన్‌కృష్ణ, ఎడమ చేతిపై వినోద్ అని పచ్చబొట్టు ఉందని తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జీజీహెచ్ మార్చురీకి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కోడూరుపాడులో మహిళ అనుమానాస్పద మృతి

● అత్యాచారం చేసి ఉంటారని సందేహం



మహిళ మృతదేహం

నెల్లూరు రూరల్, ఏప్రిల్ 7 : నెల్లూరులోని నవలాకుల తోటలో మస్తానమ్మ అనే మహిళ దారుణ హత్య జరిగిన నెల రోజులు కాకముందే కోడూరుపాడులో మరో మహిళ అనుమానాస్పద స్థితిలో దారుణంగా మృతి చెందింది. అత్యాచార సమయంలో ఆమె ప్రాణాలు కోల్పోయి ఉండవచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు. కోడూరుపాడు అరుంధతీవాడకు సమీపానున్న లేబూరు రామచంద్రారెడ్డి టెంకాయ తోపులో ఈ ఘటన ఆదివారం వెలుగు చూసింది. రూరల్ పోలీసులు, స్థానికుల నుంచి సేకరించిన సమాచారం మేరకు... ఇందుకూరుపేటకు చెందిన దార్ల సుబ్బరత్నమ్మ (47) అనే మహిళ మృతి చెందింది. ఆమె చెడు తిరుగుళ్లకు అలవాటుపడి ఇంటి నుంచి బయటకు వచ్చి రెండు, మూడు రోజులకు తిరిగి వెళ్లేదని పోలీసులు తెలిపారు. పైగా ఆమెకు మద్యపానం అలవాటు కూడా ఉందని ఆమె భర్త రమణయ్య ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. కాగా, ఆమెను ఎవరో టెంకాయ తోపు వద్దకు తీసుకువచ్చి మద్యం తాగించి అత్యాచారం చేస్తున్న క్రమంలో ఊపిరాడక మరణించి ఉంటుందని పోలీసులు ప్రాథమికంగా అనుమానిస్తున్నారు. ఘటనా స్థలి నుంచి ఆమె సెల్ ఫోను సేకరించిన పోలీసులు అందులో కాల్ హిస్టరీ డిలీట్ చేసి ఉందని గుర్తించారు. పోలీసు జాగిలాలు వచ్చినా ఎటువంటి ఆచూకీ లభ్యం కాలేదు. అయితే సుబ్బరత్నమ్మ ఫోన్ కాల్ డేటా ఆధారంగా పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం తరలించి కేసు నమోదు చేసినట్లు సీఐ మారుతీ కృష్ణ తెలిపారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో
బాయిలర్ లైవ్	161
లేయర్ లైవ్	95
స్కిన్ చికెన్	280
స్కిన్‌లెస్	310
లేయర్	162

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)

ఒక గ్రాము ధర	రూ. 6731
వెండి కిలో ధర	రూ. 83,000
వెండి ఒక గ్రాము	రూ. 85.00

సమస్యల లోగిళ్లు.. కళాశాల హాస్టళ్లు

● నాడు- నేడు పథకంలో దక్కని చోటు



ఆత్మకూరులో దశాబ్దకాలంగా అద్దె భవనంలో నడుస్తున్న బీసీ బాలుర కళాశాల హాస్టల్

ఆత్మకూరు, ఏప్రిల్ 7 : ఐదేళ్ల వైసీపీ పాలనలో సమస్యల వలయంలో చిక్కిన ప్రభుత్వ కళాశాల హాస్టళ్లపై ఎవరూ దృష్టి సారించలేదు. 15 ఏళ్ల క్రితం సీఎం వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ఉన్నత చదువులు చదివే విద్యార్థులకు సైతం హాస్టల్ వసతి కల్పించాలనే లక్ష్యంతో ప్రభుత్వ కళాశాల హాస్టళ్ల ఏర్పాటుకు శ్రీకారం చుట్టారు. ఈ హాస్టళ్లు ఇంటర్మీడియట్ నుంచి పీజీ వరకు చదివే విద్యార్థులకు బాసటగా నిలిచాయి. కాని పాలకులు వీటిపై సవతి ప్రేమ చూపుతుండడంతో నిరాదరణకు గురవుతున్నాయి. పదేళ్లుగా శాశ్వత భవనాలు లేక పలు హాస్టళ్లు చాలీచాలని అద్దె భవనాల్లో నడుస్తున్నాయి. దాంతో విద్యార్థులకు అవస్థలు తప్పడంలేదు. జిల్లాలో ఇంటర్ నుంచి పీజీ వరకు చదువులు చదివే విద్యార్థుల సౌకర్యార్థం 20 బీసీ ప్రభుత్వ బాలుర, బాలికల వసతి గృహాలు ఉన్నాయి. అయితే అందులో కొన్ని హాస్టళ్లు ఏళ్లతరబడి అద్దెభవనాల్లోనే ఉన్నాయి. చాలీచాలనీ వసతులతో విద్యార్థులకు అవస్థలు తప్పడం లేదు. ఇందుకు ఆత్మకూరలోని కాలేజీ హాస్టళ్లే ప్రత్యక్ష నిదర్శనం. ఆత్మకూరులో బీసీ బాలుర, బీసీ బాలికల కాలేజి హాస్టళ్లతో పాటు ఎస్సీ బాలుర హాస్టల్ ఉన్నాయి. అయితే బీసీ బాలుర కాలేజి వసతిగృహం 15 ఏళ్లుగా అద్దెభవనంలోనే కొనసాగు తోంది. ప్రస్తుతం ఆ హాస్టల్‌లో 80 మందికి పైగా కాలేజిల విద్యార్థులు చదువుకొంటున్నారు. అయి తే వారికి సరైన వసతులు లేక అవస్థలు పడుతున్నారు. విద్యార్థులకు సరిపడా గదులు లేక ఇరుకుగదుల్లోనే కాలం ఇక బీసీ బాలికల కాలేజి వసతిగృహం సైతం అద్దెభవనంలోనే కొనసాగుతుంది.ఈ హాస్టల్‌లో ఈ ఏడాది 90 మంది విద్యార్థినులకు పైగా చదువుతు న్నారు. అయితే వారికి సరైన వసతుల లేక ఇబ్బందులు పడుతున్నారు.

ఉన్నతాధికారులకు నివేదించాం

ఆత్మకూరులోని బీసీ బాలుర, బాలికల కళాశాల వసతి గృహాలు అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి. శాశ్వత భవనాల నిర్మాణాల కోసం ఉన్నతాధికారులకు నివేదించాం. శాశ్వత భవనాల నిర్మాణం చేపడితే విద్యార్థులకు మెరుగైన వసతులు సమచేకూరుతాయి.

\- ఎం శ్రీదేవి, ఏబీసీడబ్ల్యూవో, ఆత్మకూరు

సోమశిలలో 9.069 టీఎంసీల నిల్వ

అనంతసాగరం, ఏప్రిల్ 7: సోమశిల పూర్తిసామర్థ్యం 77.988 టీఎంసీలు కాగా ఆదివారానికి ప్రాజెక్టులో 9.069 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు అధికారులు తెలిపారు. దిగు వ ఉత్తర కాలువకు 50, డెల్టాకు 650, దక్షిణ కాలువకు 170 క్యూసెక్కులు సరఫరా చేస్తున్నారు.

జల'కలేనా' !

● ప్రతి ఎకరాకు నీరేది జగనన్నా..?
● లబ్ధిదారులకు దక్కని భరోసా
● నీరుగారిన జలకళ పథకం



జలకళ పథకం కింద రైతు పొలంలో బోరు వేస్తున్న యంత్రం(ఫైల్)

ఉదయగిరి రూరల్, ఏప్రిల్ 7: 'ప్రతి ఎకరాకు సాగునీరందిస్తాం.. రెండున్నర ఎకరాలకు ఒకచోట ఉచితంగా బోరు వేయిస్తాం.. రైతుల సాగునీటి కష్టాలు తీరుస్తాం'... అని చెప్పిన వైసీపీ ప్రభుత్వం మాటలు నీటిమూటలుగా మిగిలాయి. వైఎస్ఆర్ జలకళ పథకానికి దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులకు భంగపాటు తప్పలేదు. సాగునీరు అందించేందుకు నిర్మిస్తున్న ప్రాజెక్టుల పనులు ముందుకు సాగడంలేదు. కనీసం భూగర్భజలాలను వినియోగించుకుని పంటలు సాగు చేయాలనుకున్నా రైతుల ఆశలపై అధికారులు నీళ్లు చల్లారు. ప్రతి ఎకరాకూ సాగునీరు అందించాలన్న ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం జలకళ పథకాన్ని ప్రకటించినా రైతులకు ప్రయోజనం చేకూరలేదు. ఫలితంగా పథకం ఉద్దేశం నీరుగారింది. వ్యవసాయంపై ఆధారపడిన చిన్న, సన్నకారు రైతులు సాగునీటికి ఇబ్బంది పడకుండా భరోసా కల్పించడానికి ఈ పథకాన్ని అమల్లోకి తెచ్చినా బోర్లు వేయడంపై ప్రభుత్వం అంతగా ఆసక్తి కనపర్చలేదు.

● వేసింది 201 బోర్లే..

రెండున్నర ఎకరాల భూమి లేకుంటే పక్కనున్న మిగిలిన రైతుల పొలాలకు కలిపి ఒక బోరు ఏర్పాటు చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం వెసులుబాటు కల్పించింది. బోరు వేసిన ప్రదేశంలో నీరు పడకపోతే పక్కనే మరొకటి వేసేందుకు అవకాశం ఇస్తామని చెప్పింది. భూగర్భజలాల లభ్యతపై సర్వే చేసి బోర్ల ఏర్పాటుకు అనుమతి ఇచ్చింది. ఉదయగిరి నియోజకవర్గంలోని ఎనిమిది మండలాల్లో 3,219 మంది రైతులు జలకళ పథకానికి దరఖాస్తు చేసుకున్నారు. వాటిలో 2,759 దరఖాస్తులను రెవెన్యూ అధికారులు అప్రూవల్ చేశారు. 697 మంది రైతుల పొలాల్లో భూగర్భ జలాల లభ్యతపై జియాలజిస్టులు సర్వే చేశారు. వాటిలో అధికారులు 630 బోర్లు వేసేందుకు ప్రతిపాదనలు పంపగా ప్రభుత్వం ఆమోదం తెలిపింది. అయితే ఇప్పటివరకు 201 బోర్లు మాత్రమే వేసింది. దీన్ని బట్టి చూస్తుంటే రాష్ట్ర ప్రభుత్వానికి రైతులపై ఎంత ప్రేమ ఉందో అర్థం చేసుకోవచ్చు. ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున బోర్ల తవ్వకాల పనులు నిలిచిపోయాయని, ఎన్నికల అనంతరం ప్రభుత్వ ఆదేశాలను అనుసరించి చర్యలు తీసుకుంటామని సంబంధిత అధికారులు తెలిపారు.

ఒక్క అవకాశమిస్తే అభివృద్ధి ఏమిటో చూపిస్తా !

● ఉదయగిరి టీడీపీ ఉమ్మడి అభ్యర్థి కాకర్ల సురేష్

వింజమూరు, ఏప్రిల్ 7: మండలంలోని కిస్తిపురం, చింతలపాలెం, అరవీడుపల్లి, చంద్రపడియ, తొగటపాలెం, బుక్కాపురం గ్రామాల్లోని ఎస్సీ, ఎసీ కాలనీల్లో ఆదివారం తెలుగుదేశం, బీజేపీ, జనసేన ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి కాకర్ల సురేష్ ఇంటింటా ప్రచారం నిర్వహించారు. అడుగడుగునా కాకర్లకు ప్రజలు ఘనంగా స్వాగతం పలికారు. సైకిల్ గుర్తుకు ఓటు వేసి తెలుగు దేశాన్ని గెలిపించాలని ప్రతి ఒక్కరిని అభ్యర్థించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఒక్క అవకాశం ఇచ్చి ఆశీర్వదించండి కొన్ని జీవితాలు మారుస్తానని, నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తానని తెలిపారు. టీడీపీ హయాంలో చేసిన అభివృద్ధి మాత్రమే పల్లెల్లో కనిపిస్తుందని వైసీపీ ప్రభుత్వ హయాంలో ఒరిగిందేమీ లేదన్నారు. గత ఐదేళ్లుగా రాష్ట్రం అధోగతి పాలై 20 సంవత్సరాలు వెనక్కిపోయిందన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికల్లో ఇచ్చిన హామీలను తుంగలో తొక్కారని ఆరోపించారు. 40ఏళ్లుగా ఈ ప్రాంతాన్ని పాలిస్తున్న మేకపాటి కుటుంబంతో అభివృద్ధి ఎక్కడి వేసిన గొంగళి అక్కడే ఉంది అన్న చందంగా ఉందన్నారు. సమస్యలు నేటికి అలాగే ఉన్నాయే తప్ప మార్పు రాలేదన్నారు. మార్పు రావాలంటే అజాతశత్రువు, అపర భగీరథుడు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిని ఎంపీగా, అదేవిధంగా ట్రస్టు ద్వారా మీకు అనేక సేవలు చేస్తూ మీ మనిషిగా ఉన్న నన్ను గెలిపించాలని కోరారు. ప్రతి పల్లెల్లో టీడీపీ నాయకులు, అభిమానులు కాకర్ల సురేష్‌ను శాలువా, గజమాలలతో సత్కరించారు. కిస్తీపురం పంచాయతీ సర్పంచ్ దాట్ల రమణారెడ్డి కాకర్ల వెంట ఇంటింటి ప్రచారం నిర్వహించారు. అలాగే చంద్రపడియ గ్రామంలో యూనిట్ ఇన్‌చార్జ్ పాములపాటి మాల్యాద్రి ఆధ్వర్యంలో ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ గొంగటి రఘునాథరెడ్డి, మాజీ కన్వీనర్ గూడా నరసా రెడ్డి, క్లస్టర్ ఇన్‌చార్జ్ దంతులూరు వెంకటేశ్వరరావు, జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి చల్లా వెంకటేశ్వర్లు, జనసేన మండల అధ్యక్షులు బండారు సత్యనారాయణ, బీజేపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.



కాకర్ల సురేష్‌తో కలిసి విక్టరీ సింబల్ చూపుతున్న చింతలపాలెం గ్రామ మహిళలు



కాకర్లకు వినతిపత్రం ఇస్తున్న విశ్వ బ్రాహ్మణ సంఘం నాయకులు

ఉదయగిరి రూరల్: ఉదయగిరి అసెంబ్లీ ఉమ్మడి అభ్యర్థి కాకర్ల సురేష్‌ను ఆది వారం విశ్వబ్రాహ్మణ సంఘ నాయకులు వింజ మూరులోని బొమ్మరాజుచెరువులోని టీడీపీ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జిల్లాలో విశ్వబ్రాహ్మణులు ఎదు ర్కొంటున్న సమస్యలను ఆయనకు వినతిపత్రం అందజేశారు. సానుకూలంగా స్పందించిన కాకర్ల సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. టీడీపీ అధికారంలోకి రాగానే విశ్వబ్రాహ్మణుల సమస్యలపై ప్రత్యేక దృష్టి సారిస్తామన్నారు. ఈ సందర్భంగా విశ్వబ్రాహ్మణ సంఘ నాయకులు జిల్లాలో మహాకూటమి అభ్యర్థుల విజయానికి తమవంతు కృషి చేస్తామని చెప్పారు. అనంతరం కాకర్లను సన్మానించి జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమంలో విశ్వబ్రాహ్మణ సంఘ జిల్లా అధ్యక్షుడు ఆగర సుబ్రహ్మణ్యం అచారి, ప్రధాన కార్యదర్శి విజయాచారి, కోశాధికారి, వర్కింగ్ ప్రెసిడెంట్ కృష్ణమూర్తి, అర్కాట్‌కుమార్, నాయకులు రామకృష్ణ, సుమన్, పిచ్చయ్య, బాలబ్రహ్మాచారి, చెన్నయ్య పాల్గొన్నారు.

'సోమశిల' మనుగడకే ప్రమాదం తెచ్చారు

అనంతసాగరం, ఏప్రిల్ 7: జిల్లాకు సాగు, తాగు నీటిని అందించే మహత్తర ప్రాజెక్టు సోమశిల మనగడ నేడు ప్రమాదకర స్థితికి చేరిందని, ఇందుకు కారణం వైసీపీ ప్రభుత్వమే అని ఆత్మకూరు అసెంబ్లీ టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఆనం రామనారాయణరెడ్డి ఆరోపించారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆదివారం అనంతసాగరం ప్రజాగళం సభలో ఆయన పాల్గొన్నారు. అన్ని గ్రామాల నుంచి టీడీపీ, జనసేన, బీజేపీ శ్రేణులు అధిక సంఖ్యలో వచ్చి ఆనంకు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆనం మాట్లాడారు. రాష్ట్రంలో హత్యా రాజకీయం నడుస్తుందని ఈ ఎన్నికల్లో వైసీపీని వేర్లతో సహా పెకిలించాలని ఓటర్లకు అభ్యర్థించారు. ఒక్కచాన్స్ అంటూ అధికారంలోకి వచ్చి రాష్ట్రాని అధోగతి పట్టించారని మండిపడ్డారు. నియోజకర్గంలో తన హయంలో జరిగిన అభివృద్ధిని ఆనం గుర్తుచేశారు. అధ్వానంగా ఉన్న ఆత్మకూరు సోమశిల రహదారిని రెండు వరసల రోడ్డుగా మార్చినట్లు గుర్తుచేశారు. సోమశిలకు అగ్రికల్చర్ కళాశాలను తెచ్చానని చెప్పారు. సోమశిల డ్యాం ప్రాజెక్టు అభివృద్ధికి తాను ఎంతగానో పనిచేశానని అయితే నేడు డ్యాం దెబ్బతిని మూడేళ్ల గడుస్తున్నా మరమ్మతు పనులు చేపట్టక పోవడం విస్మయానికి గురిచేస్తుం దన్నారు. మెట్టగ్రామాలకు సంజీవని లాంటి హైలెవల్ కెనాల్ పనులు పూర్తి చేయలేదని అందులో భాగమైన నాయకులకు ఆదాయం చేకూర్చే గ్రావెల్ పనులు చేస్తున్నట్లు తెలిపారు. తన రాజకీయ ప్రస్థానంలో ఇంతవరకు ఎలాంటి అవినీతి మచ్చలేదని చెబుతూనే ఆత్మకూరు ఎమెల్యే విక్రమ్‌రెడ్డిపై పరోక్ష విమర్శలు చేశారు. ఈ ఎన్నికల్లో సైకిల్ గుర్తుపై ఓటు వేసి టీడీపీ అధికారంలోకి వచ్చేలా చూడాలని కోరారు. తన హయాంలో ఆత్మకూరులో జరిగిన అభివృద్ధిని సీడీ రూపంలో విడుదల చేశారు. తొలుత ఉదయగిరి ఎమెల్యే మేకపాటి చంద్రశేఖరరెడ్డి ప్రసంగించారు. కార్యక్రమంలో మాజీ ఎమెల్యేలు కంభం విజయరామిరెడ్డి, కొమ్మి లక్ష్మయ్యనాయుడు, ఆత్మకూరు జనసేన నాయకులు నలిశెట్టి శ్రీధర్, బీజేపీ నాయకులు కాకూరు నాగరాజారెడ్డి, రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సీడీని విడుదల చేస్తున్న ఆనం, తదితరులు

ఆనం సమక్షంలో పార్టీలో చేరిన కొత్తపల్లి వాసులు

ఏఎస్ పేట: గుడిపాడు పంచాయతీలోని కొత్తపల్లివాసులు ఆదివారం ఆత్మకూరు టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఆనం రామనారాయణరెడ్డి సమక్షంలో పార్టీలో చేరారు. గ్రామనికి చెందిన పొలిమేరు నాగేశ్వరరెడ్డి, కాటంరెడ్డి రవీంద్రారెడ్డి, దుద్దుగుంట మాధవరెడ్డి, పొలిమేరు బాల్రెడ్డి, సుబ్బారెడ్డి, మొలక మాల కొండారెడ్డితో 30కుటుంబాలు వారితో ఉన్నాయి. కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ అబ్బూరి రమేష్ నాయుడు, దేవరాల హజరత్తయ్య, నంది వివేకానందరెడ్డి, కాటంరెడ్డి నరసింహరెడ్డి, సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జనసేనలో చేరిన యువత



జనసేనలో చేరిన వారికి కండువాలు వేస్తున్న నలిశెట్టి శ్రీధర్

సంగం, ఏప్రిల్ 7: మండలంలోని సంగం, ఉడ్‌హౌస్ పేట, కోలగట్ల, గాంధీ జనసంఘం గ్రామాలకు చెందిన పలువురు యువకులు ఆదివారం జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి నలిశెట్టి శ్రీధర్ ఆధ్వర్యంలో పార్టీలో చేరారు. వీరికి శ్రీధర్ పార్టీ కండువాలు కప్పి స్వాగతించారు. ఈ సందర్భంగా పార్టీలో చేరిన వారు మాట్లాడారు. జనసేన, తెలుగుదేశం, బీజేపీ ఉమ్మడి అభ్యర్థుల విజయం కోసం కృషి చేస్తామని పేర్కొన్నారు.

నాగారపమ్మకు ప్రత్యేక పూజలు



నాగారపమ్మను దర్శించుకుంటున్న భక్తులు

సంగం, ఏప్రిల్ 7: కోలగట్ల పెన్నానది ఒడ్డున వెలసిన నాగారపమ్మకు ఆదివారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులు పొంగళ్లతో నైవేద్యం సమర్పించారు. మధ్యాహ్నం ఆలయంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

కంపచెట్లను తొలగించండి

ఉదయగిరి, ఏప్రిల్ 7: పట్టణ సమీపంలోని అబీద్ బాబా దర్గా సమీపంలోని కోనకాలువకు ఇరువైపులా అల్లుకున్న కంపచెట్లను తొలగించాలని స్థానికులు కోరుతున్నారు. పట్టణంలో సగానికిపైగా జనం ఈ కాలువ తాగునీటిపై ఆధారపడి జీవిస్తున్నారని చెప్పారు. కంపచెట్లు తొలగించక పోవడంతో విషపురుగులు నీటిలో పడి నీరు కలుషితం అవుతున్నట్లు వాపోతున్నారు. ఈ విషయాన్ని ఎన్నిసార్లు పంచాయతీ అధికారులకు తెలిపినా స్పందించడం లేదని మండిపడ్డారు. జిల్లా అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.



వైసీపీకి గుణపాఠం చెప్పేందుకు ప్రజలు సిద్ధం

● టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి చెంచలబాబు

ఉదయగిరి రూరల్, ఏప్రిల్ 7: ఒక్క అవకాశమని చెప్పి రాష్ట్రాన్ని సర్వనాశనం చేసిన వైసీపీకి ఎప్పుడు గుణపాఠం చెబుదామా అని రాష్ట్ర ప్రజలు ఎదురుచూస్తున్నారని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పొన్నెబోయిన చెంచలబాబు యాదవ్ అన్నారు. ఆదివారం స్థానిక చెంచురామయ్య అతిథిగృహంలో 17పంచాయతీల టీడీపీ నాయకులు, కార్యకర్తలతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించి మాట్లాడారు. వైసీపీ ప్రభుత్వంపై ప్రజలు విసిగివేసారి పోయి టీడీపీ చేపడుతున్న ప్రచార కార్యక్రమాలకు బ్రహ్మరథం పడుతున్నట్లు చెప్పారు. ప్రతి గ్రామంలో వైసీపీ అవలంబిస్తున్న విధానాలు, పెంచిన విద్యుత్, ఆర్టీసీ, నిత్యావసర వస్తువుల ధరలపై ప్రజలు తీవ్ర నిరసన వ్యక్తం చేస్తున్నట్లు తెలిపారు. వలంటీర్ల వ్యవస్థకు టీడీపీ ప్రభుత్వం వ్యతిరేకం కాదని, వారు చేసే రాజకీయాలకు మాత్రమే వ్యతిరేకమన్నారు. వైసీపీ ప్రభుత్వం సంక్షేమం పేరుతో రాష్ట్రంలో ఆర్థిక సంక్షోభం సృష్టించిందన్నారు. ఈ ఎన్నికల్లో రాష్ట్రంలో మహాకూటమి ఘన విజయం సాధించి చంద్రబాబు ముఖ్యమంత్రి కావడం తథ్యమన్నారు. అలాగే నెల్లూరు పార్లమెంట్, ఉదయగిరి అసెంబ్లీ ఉమ్మడి అభ్యర్థులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కాకర్ల సురేష్‌లకు సైకిల్ గుర్తుపై ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మండల టీడీపీ కన్వీనర్ బయ్యన్న, నాయకులు రియాజ్, బొజ్జా నరసింహులు, నల్లిపోగు రాజా, ఓబులరెడ్డి, నరసింహా, రమణారెడ్డి, రమణయ్య, శివకృష్ణ, జల్సాయాదవ్, మస్తాన్, హరీష్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న చెంచలబాబు

శేషవాహనంపై సంగమేశ్వరుడు

సంగం, ఏప్రిల్ 7: సంగమేశ్వరుడి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం రాత్రి స్వామి వారు శేషవాహనసేనంపై ఊరేగారు. ఈ సందర్భంగా కామాక్షీదేవి సహిత సంగమేశ్వరస్వామి ఉత్సవ విగ్రహాలను గజపూలమాలలతో అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. ఉత్సవ రథంను విద్యుత్ దీపాలతో అలంకరించి సంగం పురవీధుల్లో ఊరేగించారు. స్వామివారి ఉత్సవానికి భక్తులు కర్పూర హారతులతో స్వాగతం పలికారు. ఈ కార్యక్రమానికి శాఖవరపు శ్రీహరి, శివకుమార్ ఉభయకర్తలుగా వ్యవహరించారు. అనంతరం ఆలయంలో స్వామి, అమ్మవారికి పూలంగి సేవ నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు గోపాలకృష్ణమూర్తి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. ఆలయ చైర్మన్ రవీంద్రబాబు, సభ్యులు కార్యక్రమాలను పర్యవేక్షించారు.



శేష వాహనంపై భక్తులకు దర్శనమిస్తున్న సంగమేశ్వరుడు

నిరుపేద కుటుంబాలకు ఆర్థిక సాయం

ఉదయగిరి రూరల్, ఏప్రిల్ 7: రంజాన్‌ను పురస్కరించుకొని పట్టణంలోని దిలావర్‌భాయ్ వీధిలో కూలి పనులు, చేతివృత్తులు, చిరుద్యోగులు చేస్తున్న 30ముస్లిం నిరుపేద కుటుంబాలకు ఆదివారం దిలావర్ భాయ్ వెల్ఫేర్ అండ్ రిలీఫ్ ఆర్గనైజేషన్ సంస్థ నిర్వాహకులు ఆర్థికసాయం అందజేశారు. ఒక్కొక్క కుటుంబానికి రూ.1500నుంచి రూ.3వేల వరకు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ప్రతి పేదవాడు పండుగను సంతోషంగా జరుపుకునేందుకు సంస్థ ఆధ్వర్యంలో ప్రతి ఏడాది ఆర్థికసాయం చేస్తామన్నారు. సంస్థ అధ్యక్షుడు రఫీ, కార్యదర్శి ముక్తియార్, సభ్యులు మసూద్, నస్రుల్లా, దావూద్, అలీ, దిలావర్, అష్ఫాక్, మహబూబ్‌బాషా, అజీజ్ పాల్గొన్నారు.



పేదలకు నగదు అందజేస్తున్న సంస్థ ప్రతినిధులు

గ్రామాల్లో వైసీపీ ప్రచారం

దుత్తలూరు(ఉదయగిరి రూరల్): సార్వత్రిక ఎన్నికల్లో నియోజకవర్గ వైసీపీ అభ్యర్థి మేకపాటి రాజగోపాల్‌రెడ్డిని గెలిపించాలని ఆదివారం వైసీపీ నాయకులు దుత్తలూరు బీసీ, పూసల, ఏసీ కాలనీల్లో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ దొంతిరెడ్డి వాసుదేవరెడ్డి, కండ్లగుంట వెంకటరెడ్డి, జయసింహారెడ్డి, వెంకటేశ్వరరెడ్డి, గంగాధర్ పాల్గొన్నారు.

కావలి
కందుకూరు, ఆత్మకూరు, ఉదయగిరి

జనసేనలో చేరిన పాలడుగు

కావలి, ఏప్రిల్ 7: కావలిరూరల్ మండలం తుమ్మలపెంటకు చెందిన పాలడుగు వెంకటేశ్వర్లు తన అనుచరులతో వైసీపీని వీడి జనసేన నేతలు సమ్మన వెంకటసుబ్బయ్య, సిద్ధూ ఆధ్వర్యంలో ఆదివారం నెల్లూరులో జనసేన జిల్లా అధ్యక్షుడు మనుక్రాంతరెడ్డి సమక్షంలో పార్టీలో చేరారు.

ఒక్క అవకాశం ఇవ్వండి : కావ్య

కావలి, ఏప్రిల్ 7: ఎమ్మెల్యేగా ఒక్క అవకాశం ఇస్తే కావలి నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తానని కావలి టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి అభ్యర్థి కావ్య క్రిష్ణారెడ్డి తెలిపారు. పట్టణంలోని 14వ వార్డు ముసునూరులో ఆదివారం ఆయన టీడీపీ, జనసేన, బీజేపీ నేతలతో కలిసి ఇంటింటి ప్రచార నిర్వహించారు. టీడీపీ అధికారంలోకి వస్తే అమలు చేయబోయే సూపర్ సిక్స్ పథకాల గురించి వివరించారు. ముఖ్యంగా పింఛన్ రూ.4,000 పెంచి ప్రతి నెలా ఇంటివద్దకే వచ్చి అందజేస్తామన్నారు. కావలి ప్రజలు ఎమ్మెల్యేగా నన్ను, ఎంపీగా వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిని గెలిపిస్తే కావలిని అభివృద్ధి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు ఇన్‌చార్జి వెంకటేశ్వర్లు, టీడీపీ నేత లింగం మాల్యాద్రి, జనసేన నేతలు సిద్ధూ, ఆలా శ్రీనాథ్ తదితరులు పాల్గొన్నారు.

అన్నగారిపాలెం వాసులు టీడీపీలో చేరిక : కావలిరూరల్ మండలం అన్నగారిపాలెం పంచాయతీకి చెందిన వైసీపీ నాయకులు మాజీ మండల పరిషత్ ఉపాధ్యక్షుడు పులగం రామారావు, మాజీ సర్పంచు వై.వెంకటేశ్వర్లు, అళహరి హనుమంతరావు, గుద్దేటి వెంకటప్రసాద్ వారి అనుచరులు, పాత హరిజనవాడ యానాదిసంఘం నుంచి 43 కుటుంబాలు టీడీపీ రూరల్ మండల అధ్యక్షుడు ఆవుల రామకృష్ణ, గోపాలపు నరసింహారావు, గోళ్ల శ్రీనివాసులు ఆధ్వర్యంలో వైసీపీని వీడి టీడీపీలో చేరారు. అలాగే తుమ్మలపెంట పట్టపుపాలెంకు చెందిన చిననాగూర్, జయరాం వారి అనుచరులు భారీగా వైసీపీని వీడి టీడీపీలో చేరారు. పట్టణంలోని ముసునూరు టీడీపీ కార్యాలయంలో ఆదివారం జరిగిన ఈ కార్యక్రమంలో వారందరికీ అభ్యర్థి కావ్య క్రిష్ణారెడ్డి పార్టీ కండువాలను కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ, జనసేన నాయకులు పాల్గొన్నారు.



టీడీపీలో చేరిన వైసీపీ నేతలతో కావ్య

రాష్ట్ర అభివృద్ధికి వైసీపీని ఓడించండి

కావలి రూరల్ : రాష్ట్ర అభివృద్ధి కోసం వైసీపీని ఓడించి టీడీపీని గెలిపించాలని టీడీపీ, బీజేపీ, జనసేన ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి కావ్య క్రిష్ణారెడ్డి పేర్కొన్నారు. కావలి మండలం తాళ్లపాలెం పంచాయతీ లింగంగుంట, రామచంద్రాపురం, గండి హరిజనవాడ, తాళ్లపాలెం, జువ్విగుంటపాలెం, కోటడవి, బట్లదిన్నె తదితర గ్రామాల్లో ఆదివారం సాయంత్రం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్ రెడ్డి దోచుకోవటం దాచుకోవటం తప్ప చేసిన అభివృద్ధి శూన్యం అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఆవుల రామక్రిష్ణ, ఉప్పాల వెంకట్రావు, కండ్లగుంట మధుబాబు నాయుడు, జనసేన నాయకుడు సిద్ధూ, కోసూరి వెంకటేశ్వర్లు, నాయకులు దగ్గుమాటి మాల్యాద్రి రెడ్డి, మక్కి శ్రీహరి, జడ్డా శేఖర్ బాబు, రవి, ప్రసాద్, ఉప్పాల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమమంటూ అభివృద్ధికి తిలోదకాలు

అల్లూరు, ఏప్రిల్ 7 : వైసీపీ ప్రభుత్వం సంక్షేమమంటూ రాష్ట్రంలో అభివృద్ధి మరచి యువతకు ఉద్యోగ అవకాశాలు లేకుండా చేసిందని నెల్లూరు పార్లమెంటు ఉపాధ్యక్షుడు బీద గిరిధర్ అన్నారు. ఆయన ఆదివారం అల్లూరు పట్టణ పరిధిలోని కలుగోళమ్మ గుడివీధి, పంచాయతీ ఆఫీసు వీధి, వెంగన్నగుంట, ఆర్‌డీఆర్ కాలనీల్లో టీడీపీ అభ్యర్థి కావ్య కృష్ణారెడ్డి అల్లుడు వాకాటి బినీత్‌రెడ్డి, వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి మేనల్లుడు ఎ.చందన్‌రెడ్డిలతో కలసి ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లని, ఒకేవైపు మొగ్గుచూపితే మరోవైపు తీవ్ర నష్టానికి గురవుతారన్నారు. ఈ కార్యక్రమంలో బండి శ్రీనివాసులు రెడ్డి, ఊటు శ్రీకాంత్‌రెడ్డి, నీలపరెడ్డి హరీష్‌రెడ్డి, నీలపరెడ్డి హరీష్‌రెడ్డి, అరగల రమణయ్య, అనూరాధ, నజీర్‌బాషా, గోళ్ళ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.



ఇంటింటి ప్రచారంలో గిరిధర్, వాకాటి బినీత్‌రెడ్డి

గ్రామీణ వైద్యులు ప్రాణదాతలు : ఇంటూరి రాజేష్

కందుకూరు, ఏప్రిల్ 7: గ్రామీణ వైద్యులు ప్రాణదాతలని తెలుగుదేశం పార్టీ నెల్లూరు పార్లమెంటు ఉపాధ్యక్షుడు ఇంటూరి రాజేష్ పేర్కొన్నారు. పట్టణంలోని పామూరు రోడ్డులో ఉన్న ఎస్వీఎస్ కళ్యాణ మండపంలో ఆదివారం కందుకూరు నియోజకవర్గంలోని గ్రామీణ వైద్యుల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఇంటూరి రాజేష్ మాట్లాడుతూ సాధారణ వ్యాధులకు వేలకువేలు ఖర్చులేకుండా సామాన్యులకు ఇంటివద్దే వైద్యచికిత్సలు అందించటం ద్వారా గ్రామీణ వైద్యులు చేస్తున్న సేవ మరువలేనిదన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామీణ వైద్యులసంఘం ప్రతినిధులు స్వర్ణ తిరుమలరావు, సింగయ్య, కె.రామరాఘవులు, నరసింహారావు, సుధాకర్, అనిల్‌కుమార్, గంగోలు మాల్యాద్రి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఇంటూరి రాజేష్

భక్తిశ్రద్ధలతో దేశమ్మకు పొంగళ్లు

దగదర్తి (బిట్రగుంట), ఏప్రిల్ 7: దగదర్తి మండలం శ్రీరామపురం పంచాయతీలో కొలువై ఉన్న గ్రామదేవత దేశమ్మకు ఆదివారం పొంగళ్ల కార్యక్రమం నిర్వహించారు. ప్రత్యేక పూజల అనంతరం అమ్మవారు కుంకుమ అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులకు అన్నసంతర్పన జరిగింది. కాగా శనివారం రాత్రి అమ్మవారికి గ్రామోత్సవం వైభవంగా జరిగింది. భక్తులు కాయాకర్పూర హారతులు అందచేశారు.



గ్రామోత్సవంలో దేశమ్మ

బూత్ ఇన్‌చార్జిలకు అవగాహన

కొండాపురం, ఏప్రిల్ 7: మండల పరిధిలోని కొమ్మి పంచాయతీకి సంబంధించిన 210, 211, 212, 213 బూత్ ఇన్‌చార్జిలకు టీడీపీ మండల కన్వీనర్ ఎమ్.ఓంకారం ఆదివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. త్వరలో జరగనున్న ఎన్నికలలో బూతు ఇన్‌చార్జిల పాత్ర చాలా కీలకమన్నారు. ఓట్లు పోలింగ్ సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో పార్టీ పరిశీలకుడు కే.సుబ్బారావు, క్లస్టర్ ఇన్‌చార్జి సీహెచ్.వెంకటాద్రి, నాయకులు యారవ క్రిష్ణయ్య, పీ.రమేష్, చెరుకూరు శేషయ్య, చెరుకూరు వెంకపనాయుడు, షేక్ ఖాసిం, కానుల బాదుల్లా, ఆకుల మహేష్, గుంటూరు యోనా, బాలబాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

ఇఫ్తారు విందులో విష్ణువర్ధన్‌రెడ్డి

బిట్రగుంట, ఏప్రిల్ 7: బోగోలులో ముస్లింలు ఆదివారం ఏర్పాటు ఇఫ్తారు విందులో మాజీ ఎమ్మెల్యే కాటంరెడ్డి విష్ణువర్ధన్‌రెడ్డి పాల్గొన్నారు.

కొద్ది రోజులు ఓపిక పడితే అన్నీ మంచిరోజులే..

కందుకూరు, ఏప్రిల్ 7: ఐదేళ్లుగా వైసీపీ పాలనలో ఎన్నో ఇబ్బందులు పడ్డ ప్రజలు కొద్ది రోజులు ఓపికపడితే ముందున్నది మంచి రోజులేనని కందుకూరు నియోజకవర్గ టీడీపీ, జనసేన, బీజేపీల ఉమ్మడి అభ్యర్థి ఇంటూరి నాగేశ్వరరావు సతీమణి సౌజన్య పేర్కొన్నారు. పట్టణంలోని 31, 32 వార్డుల పరిధిలోని సాయినగర్‌లో ఆదివారం ఆమె ఇంటింటి ప్రచారం నిర్వహించారు. టీడీపీ మినీ మ్యానిఫెస్టోలోని సూపర్‌సిక్స్ పథకాలను వివరిస్తూ ఓటర్లకు కరపత్రాలు పంపిణీ చేశారు. రానున్న ఎన్నికల్లో చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రి కావటమే ధ్యేయంగా నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి ఇంటూరి నాగేశ్వరరావు, నెల్లూరు లోక్‌సభ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకరరెడ్డిలకు మద్దతిచ్చి వారి విజయానికి కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు దామా మల్లేశ్వరరావు, నాయకులు ముచ్చు శ్రీనివాసులు, ముప్పవరపు వేణు, జమ్ము చైతన్య, చుంచు వేణు, ఓరుగంటి రామ్మూర్తి, పసుపులేటి రమణయ్య, మచ్చా మనోహర్, ముచ్చు రాజ్యలక్ష్మి పాల్గొన్నారు.



కందుకూరు : కరపత్రాలు పంపిణీ చేస్తున్న సౌజన్య



లింగసముద్రం : ఇఫ్తార్ విందులో నాగేశ్వరరావు

టీడీపీలో ముస్లిం కుటుంబాల చేరిక

పట్టణంలోని 6వ వార్డుకు చెందిన పలు ముస్లిం కుటుంబాల వారు టీడీపీ అభ్యర్థి ఇంటూరి నాగేశ్వరరావు సమక్షంలో ఆదివారం తెలుగుదేశం పార్టీలో చేరారు. నియోజకవర్గ ముస్లిం మైనారిటీ కమిటీ ఉపాధ్యక్షుడు షేక్ ఫిరోజ్ ఆధ్వర్యంలో షేక్ అహ్మద్‌బాషా, షేక్ ఖలీల్, షేక్ రసూల్ తదితరులు వైసీపీని వీడి టీడీపీలో చేరారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు షేక్ సలాం, షేక్ రూబీ, షేక్ ఖలీల్, గౌస్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

ఇఫ్తార్ విందులో ఇంటూరి నాగేశ్వరరావు

లింగసముద్రం : మండలంలోని పెదపవనిలో ఆదివారం రాత్రి ముస్లింలు ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో కందుకూరు నియోజకవర్గ టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి అభ్యర్థి ఇంటూరి నాగేశ్వరరావు పాల్గొన్నారు. మదరసఎ-ఖమ్‌రున్నీసా మసీదులో ముస్లింలతో కలిసి దువా చేశారు. ఈ పవిత్ర రంజాన్ మాసంలో అల్లా ఆశీస్సులు అందరిపై ఉండాలని ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గం ముస్లిం మైనారిటీ అధ్యక్షుడు సయ్యద్ నాయబ్‌రసూల్, నాయకులు గొర్రెపాటి సాంబయ్య, పటాన్ హిదయతుల్లా, టెంకం హజరత్తయ్య, ఖాదర్‌బాషా, షేక్ మాబాషా, షేక్ కరీముల్లా, షేక్ రఫీ, చిన్న నాయబ్, షేక్ సలాం, జమీల్, సోంపల్లి మనోహర్ పాల్గొన్నారు.

టీడీపీ నేతల ఇంటింటి ప్రచారం



ప్రచారం చేస్తున్న తెలుగు తమ్ముళ్లు

బిట్రగుంట, ఏప్రిల్ 7: బోగోలు మండలం విశ్వనాథరావుపేట పంచాయతీ కొత్తూరులో టీడీపీ మండల కన్వీనర్ మాలేపాటి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో ఆదివారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. టీడీపీ, బీజేపీ, జనసేన ఉమ్మడి నెల్లూరు ఎంపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కావలి అసెంబ్లీ అభ్యర్థి దగుమాటి (కావ్య) క్రిష్ణారెడ్డిలను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో నేతలు సుధీర్‌బాబు, తిరుపతిరెడ్డి, శివకోటయ్య ఎల్.కిషోర్, హరిబాబు, బాలాజీ, నరసింహారావు, జయరాజ్, తదితరులు పాల్గొన్నారు.

కలిగిరిలో ముమ్మర ప్రచారం

కలిగిరి, ఏప్రిల్ 7: కలిగిరి పంచాయతీలోని ఎస్సీ, ఎస్టీ కాలనీలలో ఆదివారం తెలుగుదేశం పార్టీ గెలిస్తే అందించే సంక్షేమ పథకాల కరపత్రాలను ఇంటింటికీ పంచిపెడుతూ ఆపార్టీ నాయకులు ముమ్మర ప్రచారం నిర్వహించారు. ఎమ్మెల్యే అభ్యర్థిగా కాకర్ల సురేష్‌ను, ఎంపీ అభ్యర్థిగా వీపీఆర్‌ను గెలిపించాలని కోరారు. నాయకులు బిజ్జం క్రిష్ణారెడ్డి, ఊసా మల్యాద్రి, స్వర్ణ కొండయ్య, కొప్పోలు కొండలరావు, వెంకటరావు, పెద్ద అంకిరెడ్డి పాల్గొన్నారు.



కరపత్రాలు పంచుతున్న టీడీపీ నాయకులు

చంద్రబాబుని గెలిపించుకోవాలి : మాలేపాటి

దగదర్తి(బిట్రగుంట), ఏప్రిల్ 7: రాష్ట్రంలో వైసీపీ రాక్షస పాలన పోవాలంటే చంద్రబాబు నాయుడును గెలిపించుకోవాలని టీడీపీ కావలి నియోజకవర్గ నేత మాలేపాటి సుబ్బానాయుడు అన్నారు. దగదర్తి మండలం తిరువీధిపాడులో ఆదివారం ఆయన ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఉమ్మడి పార్టీల నెల్లూరు ఎంపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కావలి అసెంబ్లీ అభ్యర్థిగా కావ్య క్రిష్ణారెడ్డిలను గెలిపించడం అందరూ బాధ్యతగా తీసుకోవాలన్నారు. అనంతరం రాత్రి యలమంచిపాడులో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆయన వెంట నాయకులు, కార్యకర్తలు, స్థానికులు ఉన్నారు.



స్థానికులతో మాట్లాడుతున్న సుబ్బానాయుడు

ఉత్సాహం నింపిన సిద్ధం సభ : ఎమ్మెల్యే

కావలిటౌన్, ఏప్రిల్ 7: కావలిలో జరిగిన సిద్ధం సభ వైసీపీ శ్రేణుల్లో ఉత్సాహం నింపిందని ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్ రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం ముసునూరులోని ఎమ్మెల్యే నివాసం వద్ద జరిగిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు.

కాకర్ల సురేష్‌ను గెలిపించండి

కొండాపురం, ఏప్రిల్ 7: ఉదయగిరి నియోజకవర్గ టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి అభ్యర్థి కాకర్ల సురేష్‌ను గెలిపించాలంటూ సోదరుడు కాకర్ల సునీల్, భార్య సురేఖ ఆదివారం ప్రచారం నిర్వహించారు. సాయిపేట పంచాయతీలోని కొత్తపాలెంలో ఇంటింటికీ వెళ్లి తెలుగుదేశం పార్టీ ప్రవేశపెట్టిన మ్యానిఫెస్టోలోని సూపర్ సిక్స్ పథకాలను వివరిస్తూ కరపత్రాలను పంచారు. అనంతరం ఆయన రేణమాల, భీమవరప్పాడులో జరిగిన ఇఫ్తార్ విందులో పాల్గొన్నారు. నాయకులు ఎమ్.ఓంకారం, కామేపల్లి సుబ్బారావు, గంటా నరసింహులు, కుంకు మోహనరావు, దామా మహేశ్వరరావు, దామా శివబాబు, యారవ క్రిష్ణయ్య, వీ.రమేష్, బొట్లగుంట హరిబాబు పాల్గొన్నారు.



ప్రచారం నిర్వహిస్తున్న నాయకులు

నెల్లూరు సిటీ, రూరల్ కోవూరు, సర్వేపల్లి

పెన్నా పొర్లుకట్టల ఆధునికీకరణ పనులు చేపడతాం

● చెర్లోపాళెంలో టీడీపీ అభ్యర్థి ప్రశాంతిరెడ్డి ప్రచారం



చెర్లోపాళెంలో ఎన్నికల ప్రచారం చేస్తున్న వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి

కోవూరు, ఏప్రిల్ 7: పెన్నానది పొర్లుకట్టల ఆధునికీకరణ పనులు చేపడతామని టీడీపీ కోవూరు నియోజకవర్గ అభ్యర్థి వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి అన్నారు. మండల పరిధిలోని చెర్లోపాళెంలో ఆమె ఆదివారం ఎన్నికల ప్రచారం చేపట్టారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ పెన్నానది వరద వల్ల నియోజకవర్గ పరిధిలోని గ్రామాలు తీవ్రంగా నష్టపోయాయన్నారు. నియోజకవర్గ ప్రజలు ప్రశాంతంగా, స్వేచ్ఛగా జీవించేలా చేస్తామని, సమస్యల పరిష్కారానికి కృషిచేస్తామని, ప్రతీ ఇంటికీ తాగునీరు అందిస్తామన్నారు. ముఖ్యమంత్రిగా చంద్రబాబునాయుడును ఎన్నుకోవాలని, పార్లమెంటు స్థానానికి తన భర్త వేమిరెడ్డి ప్రభాకరరెడ్డిని, అసెంబ్లీ స్థానానికి తనను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. గ్రామంలోని మహలక్ష్మమ్మ ఆలయంలో పూజల అనంతరం ప్రచారం చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ జాతీయ కమిటీ అధికార ప్రతినిధి పోలంరెడ్డి దినేష్ రెడ్డి, పార్లమెంటు కమిటీ ప్రధాన కార్యదర్శి చేజర్ల వెంకటేశ్వర్లురెడ్డి, నాయకులు ఇంతా మల్లారెడ్డి, శ్యామసుందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. పెద్దసంఖ్యలో బీజేపీ, జనసేన కార్యకర్తలు పాల్గొన్నారు. కాగా, మండల పరిధిలోని పోతిరెడ్డిపాళెం గ్రామంలో వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డికి పార్టీ నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. అనంతరం పోతిరెడ్డిపాళెం, దళిత, గిరిజన కాలనీల్లో ప్రదర్శన సాగింది. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు తిరుమూరు అశోక్‌రెడ్డి, తిరుమూరు రవీంద్రరెడ్డి, యద్దల నాగరాజు మాజీ సర్పంచు తిరుమూరు వాణి తదితరులు పాల్గొన్నారు.

ఇఫ్తార్ విందులో ప్రశాంతిరెడ్డి

బుచ్చిరెడ్డిపాళెం: ఖాజానగర్‌లో మైనారిటీ నాయకులు బచ్చాబాయ్, ఖాజానగర్ ముస్లింల ఆధ్వర్యంలో ఆదివారం ఏర్పాటుచేసిన ఇఫ్తార్ విందులో వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి, పోలంరెడ్డి దినేష్‌రెడ్డి పాల్గొన్నారు. ముందుగా వారు ప్రార్థనలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఖాజానగర్‌తోపాటు బుచ్చి, మండలంలోని టీడీపీ, మైనారిటీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు.

ఎన్నికల్లో నా బిడ్డను ఆశీర్వదించండి : కురుగొండ్ల



మాజీ వైస్ ఎంపీపీ కర్లం శ్రీనివాసులునాయుడిని టీడీపీలోకి ఆహ్వానిస్తున్న లక్ష్మీసాయిప్రియ

సైదాపురం, ఏప్రిల్ 7: రానున్న ఎన్నికలో తన కుమార్తె లక్ష్మీసాయిప్రియను ఆశీర్వదిస్తే ప్రజలకు ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతుందని మాజీ ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ అన్నారు. ఆదివారం తురిమెర్ల గ్రామంలో ప్రముఖ పారిశ్రామికవేత్త మేడికొండ పద్మ మోహన్‌నాయుడు నివాసం వద్ద నిర్వహించిన టీడీపీ మండల సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మండలం నుంచి 600 కుటుంబాలు టీడీపీలో చేరాయి. వీరికి ఆయన పార్టీ కండువాలు వేసి ఆహ్వానించారు. అనంతరం లక్ష్మీసాయిప్రియ మాట్లాడారు. ఇన్ని కుటుంబాలు టీడీపీలో చేరడం తన విజయానికి శుభ సూచికమన్నారు. చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రి అయితేనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని రానున్న ఎన్నికలలో సైకిల్‌గుర్తుకు ఓటు వేసి ఆశీర్వదించాలని కోరారు. మాజీ వైస్ ఎంపీపీ కర్లం శ్రీనివాసులునాయుడు, సర్పంచు జయమ్మ, మాజీ ఎస్ ఎంపీపీ సరుపూరు వసంతలక్ష్మీలు వారితోపాటు పలువురు టీడీపీలో చేరడంతో టీడీపీ గెలుపు ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు కట్టా మోహన్‌కృష్ణారెడ్డి, పారిశ్రామిక వేత్తలు కొండేపాటి గంగాప్రసాద్, తానంకి నానాజీ, సదలవాడ హరిప్రసాద్, వెంకటగిరి బీజేపీ ఇన్‌చార్జ్ ఎస్.ఎస్.ఆర్.నాయుడు, మేడికొండ పద్మమోహన్‌నాయుడు, కొందూరు సుబ్రమణ్యంరాజు, దిలీప్‌చౌదరి పాల్గొన్నారు.

వైసీపీ అవినీతి పాలనను అంతం చేద్దాం : నీలిమారెడ్డి



ప్రచారం చేస్తున్న నీలిమారెడ్డి

ఇందుకూరుపేట, ఏప్రిల్ 7: వైసీపీ అవినీతి పాలనను అంతం చేద్దామని ప్రశాంతిరెడ్డి కుమార్తె నీలిమారెడ్డి పేర్కొన్నారు. మండలంలోని లేబూరు, నాగరాజుతోపు గ్రామాలలో ఆదివారం ఇంటింటికీ తిరిగి కరపత్రాలను పంపిణీచేసి తెలుగుదేశం ప్రభుత్వం రాగానే అమలు చేసే కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. అవినీతి రహిత పాలన అందించి కోవూరు నియోజకవర్గానికి గుర్తింపు తెస్తామని, గ్రామాలలో సమస్య లను పరిష్కరించేందుకు కృషిచేస్తామన్నారు. ఎన్నికల్లో వేమిరెడ్డి దంపతులను అత్య.దిక మెజారిటీతో గెలిపించాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో రావెళ్ల వీరేంద్రచౌదరి, చెంచుకిషోర్ యాదవ్, దువ్వూరు కల్యాణ్‌రెడ్డి, అవ్వారు ఏడుకొండలు, ఎంపీటీసీ మధుసూదన్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

వేమిరెడ్డి దంపతులను గెలిపించాలి

కొడవలూరు: వేమిరెడ్డి దంపతులను గెలిపించాలని టీడీపీ మండల కమిటీ అధ్యక్షుడు కోటంరెడ్డి అమరేంద్రరెడ్డి అన్నారు. ఆదివారం మండలంలో గుండాలమ్మపాలెంలో సర్పంచ్ కోటంరెడ్డి దివ్యరెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఎన్నికల ప్రచారంలో వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి కుటుంబ సభ్యులు ఇషిత, కృషిత, టీడీపీ మండల కమిటీ అధ్యక్షుడు కోటంరెడ్డి అమరేంద్రరెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వేమిరెడ్డి దంపతులను గెలిపించాలని కోరారు. కోటంరెడ్డి అమరేంద్రరెడ్డి మాట్లాడుతూ వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి గెలుపు తథ్యమన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు పల్లంరెడ్డి సురేష్‌రెడ్డి, పల్లంరెడ్డి సాయి మోహన్‌రెడ్డి, ఉపసర్పంచ్ డేగా నిరంజన్ తదితరులు పాల్గొన్నారు.

వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి గెలుపే లక్ష్యం : నాపా

కొడవలూరు: వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి గెలుపే లక్ష్యమని టీడీపీ సీనియర్ నాయకుడు నాపా వెంకటేశ్వర్లు నాయుడు అన్నారు. మండలంలో కమ్మపాళెం పంచాయతీ పరిధిలో గుర్రలదిన్నె గ్రామంలో ఆదివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఇంటింటికి తిరిగి సైకిల్ గుర్తుకు ఓటువేసి వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి, ఎంపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిని గెలిపించాలన్నారు. రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడిని ముఖ్యమంత్రిని చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జి శేఖర్‌రెడ్డి, కె కిషోర్‌నాయుడు, నాపా బాలకృష్ణ, నాపా మల్లి, చంద్ర తిరుపతి, కుందూర్తి నాగేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.

దళితులకు ద్రోహం చేసిన వైసీపీ

టీడీపీ మాజీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు తువ్వర ప్రవీణ్ ఆధ్వర్యంలో నియోజకవర్గంలో దళిత నాయకులు ఆదివారం వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డిని ఆమె నివాసంలో మర్యాద పూర్వకంగా కలిశారు. అనంతరం ఆత్మీయ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం దళితుల సంక్షేమ పథకాలను నిలిపివేసి ద్రోహం చేసిందని, టీడీపీ అధికారంలో వస్తే పథకాలు పునః ప్రారంభించి వారిని ఆదుకుంటామన్నారు. ఈ సమావేశంలో నియోజకవర్గం ఎస్సీ నాయకులు పంది శ్రీనివాసులు పాల్గొన్నారు.

ఘనంగా పెద్దగూడెమ్మ జాతర



బ్రహ్మదేవంలో పెద్దగూడెమ్మ గ్రామోత్సవం

ముత్తుకూరు, ఏప్రిల్ 7: మండలంలోని బ్రహ్మదేవి గ్రామంలో గ్రామ దేవత పెద్దగూడెమ్మ జాతర అంగరంగ వైభవంగా నిర్వహించారు. మూడు రోజులపాటు జరిగిన జాతర చివరిరోజు ఆదివారం అమ్మవారికి సామూహిక పొంగళ్ల నివేదన కార్యక్రమం జరిగింది. మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా పెద్దగూడెమ్మ, పోతురాజు స్వామివార్ల గ్రామోత్సవం నిర్వహించారు. భక్తులు అమ్మవారికి నైవేద్యాలు సమర్పించారు.

గాంధీ ఆశ్రమంలో సర్వమత ప్రార్థనలు

ఇందుకూరుపేట, ఏప్రిల్ 7: మండలంలోని పల్లెపాడు పినాకినీ సత్యాగ్రహ గాంధీ ఆశ్రమంలో కో కన్వీనర్ నెల్లూరు రవీంద్రరెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం సర్వమత ప్రార్థనలు జరిగాయి. ఈ కార్యక్రమంలో ముందుగా కమిటీ సభ్యులు గంపల మంజుల, బి సుధారాణిలు మహాత్మాగాంధీ, పొణకా కనకమ్మ విగ్రహాలకు నూలు మాలలు, ఖాదీ వస్త్రాలు సమర్పించారు. అనంతరం విద్యార్థులకు గాంధీ ఆశ్రమం విశేషాలు వివరించారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు గణేశం సుమంత్‌రెడ్డి, వేణురెడ్డి, ఆశ్రమ మేనేజర్ మనోజ్, సుబ్రహ్మణ్యం, డైట్ కాలేజీ విద్యార్థి భూషణ్, స్కూల్ విద్యార్థులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

గంగమ్మ ఆలయం ముస్తాబు

మనుబోలు, ఏప్రిల్ 7: స్థానిక పెద్ద చెరువు వద్ద ఉన్న గంగమ్మ ఆలయం ఉగాది వేడుకలకు ముస్తాబైంది. మనుబోలు యాదవసంఘం ఆలయానికి రంగులు వేయించి సుందరంగా తీర్చిదిద్దారు. మంగళవారం అమ్మ వారికి అభిషేకాలు, పొంగళ్ళు, అన్నసంతర్పణ, రాత్రికి గ్రామోత్సవం నిర్వహించనున్నట్లు యాదవ సంఘం తెలిపింది.

పోలీసుల కవాతు

బుచ్చిరెడ్డిపాళెం, ఏప్రిల్ 7: మండలంలోని పంచేడు, దామరమడుగు, పెనుబల్లి, జొన్నవాడ గ్రామాల్లో పోలీసులు ప్రత్యేక బలగాలతో కలిసి ఆదివారం రాత్రి కవాతు నిర్వహించారు.

● **పుట్టాలమ్మకు పానకాలు**

మండలంలోని రేబాలలో ఆదివారం రాత్రి గ్రామదేవత పుట్టాలమ్మకు పానకాలు సమర్పించుకున్నారు.

కాకాణి రాజకీయ పతనం ప్రారంభం : సోమిరెడ్డి



టీడీపీలో చేరిన వారితో సోమిరెడ్డి

పొదలకూరు, ఏప్రిల్ 7: పొదలకూరు నుంచే మంత్రి కాకాణి గోవర్ధనరెడ్డి రాజకీయ పతనం ప్రారంభం అవుతుందని మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి అన్నారు. ఆదివారం విశ్వేశ్వరపురం కాలనీకి చెందిన కొంగర నరేంద్ర, పోలిరెడ్డి మోహన్, మధు, మాల్యాద్రి, రెబ్బా మదన్, షేక్ అల్తాఫ్, గుడిపాటి మహదేవ్ వారి అనుచరులు 20 కుటుంబాలతో కలిసి టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. వారికి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, మండల అధ్యక్షుడు తలచీరు మస్తాన్‌బాబు, పట్టణ అధ్యక్షుడు బొద్దులూరు మల్లికార్జున్ నాయుడు ఆహ్వానం పలికారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పొదలకూరును గతానికి మించి అభివృద్ధి చేస్తానన్నారు. టీడీపీ నాయకులు కోవూరు బక్కయ్య నాయుడు, సాథం గిరి, బాలచంద్ర, దేవినేని శరత్, తల్లిక ప్రసాద్, ఐత సురేష్, మురళీరెడ్డి పాల్గొన్నారు.

సర్వేపల్లిని దోచుకున్న కాకాణి

వెంకటాచలం: మండలంలోని చెముడుగుంట గ్రామంలో ఆదివారం సాయంత్రం జరిగిన ఎన్నికల ప్రచారంలో మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి పాల్గొన్నారు. చంద్రబాబునాయుడు సూపర్ సిక్స్ పథకాలను ప్రజలకు వివరించారు. ఆయన మాట్లాడుతూ సర్వేపల్లి నియోజకవర్గంలో కాకాణి చేసిందల్లా దోచుకోవడం, దాచుకోవడమేనన్నారు. రాబోయే ఎన్నికల్లో కాకాణి ఓటమి ఖాయమన్నారు. ఈకార్యక్రమంలో కుంకాల దశరథ నాగేంద్రప్రసాద్, గుమ్మడి రాజాయాదవ్, బొమ్మి సురేంద్ర, దొడ్ల అశోక్, బొబ్బేపల్లి సురేష్‌నాయుడు, మావిళ్లపల్లి శ్రీనివాసులునాయుడు, పాల్గొన్నారు.

కాకాణిని ఓడించి నియోజకవర్గాన్ని కాపాడుకుందాం

తోటపల్లిగూడూరు: మంత్రి కాకాణిని ఓడించి సర్వేపల్లి నియోజకవర్గాన్ని కాపాడుకుందామని సర్వేపల్లి నియోజకవర్గ సమన్వయకర్త సోమిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి అన్నారు. మండలంలోని కొత్తపాలెం గ్రామంలో ఆదివారం యువత, టీడీపీ నాయకులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సర్వేపల్లి నియోజకవర్గంలో మంత్రి కాకాణి నియంత పాలన పోవాలంటే యువత ముందుకు వచ్చి సోమిరెడ్డిని గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి బొమ్మి సురేంద్ర, మండల అధ్యక్షుడు సన్నారెడ్డి సురేష్‌రెడ్డి, మాజీ సర్పంచ్ చేవూరు శ్రీనివాసులు, ఉపసర్పంచ్ శ్రీరామ్‌శ్రీహరి, నాయకులు శ్రీకుమార్‌రెడ్డి, గోపిరెడ్డి వెంకటేశ్వర్లు, మధురెడ్డి పాల్గొన్నారు.

ముత్తుకూరు: ముత్తుకూరు రాజమ్మకాలనీ, కొత్త దళితవాడలో ఆదివారం రాజగోపాల్‌రెడ్డి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ తిరిగి సూపర్ సిక్స్ పథకాలు వివరించారు. ఎన్నికల్లో టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి అభ్యర్థి సోమిరెడ్డి భారీ మెజారిటీతో విజయం సాధించడం ఖాయమన్నారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు పల్లంరెడ్డి రామ్మోహన్‌రెడ్డి, నాయకులు నీలం మల్లికార్జునయాదవ్, ఈపూరు మునిరెడ్డి, బొలిగర్ల శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

కంటేపల్లిలో టీడీపీ, జనసేనల ఎన్నికల ప్రచారం

వెంకటాచలం: మండలంలోని కంటేపల్లి గ్రామంలో ఆదివారం టీడీపీ, జనసేన నాయకులు కూటమి అభ్యర్థులు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, వెలగపూడి వరప్రసాద్‌ల గెలుపు కోసం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ప్రతి ఇంటికీ వెళ్లి చంద్రబాబు సూపర్ సిక్స్ పథకాలను వివరించి కరపత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆస్తోటి నాగరాజు, ఆస్తోటి రవికుమార్, కుని రత్నం, గంపా సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

నాసిరకంగా తారురోడ్డు నిర్మాణం..!



రోడ్డు మార్జిన్లకు వేసిన పాత తారురోడ్డు రబ్బిష్

బుచ్చిరెడ్డిపాళెం, ఏప్రిల్ 7: బుచ్చి - జొన్నవాడ మార్గంలో కొత్తగా వేసిన తారురోడ్డు నిర్మాణం నాసిరకంగా జరిగిందని స్థానిక ప్రజలు, ప్రయాణికులు విమర్శలు వ్యక్తం చేస్తున్నారు. తారురోడ్డుకు ఇరువైపులా గ్రావెల్ తోలి నీళ్లతో తడిపి రోలింగ్ చేసి వాహనాలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చేయాల్సి వుంది. అయితే పాత తారురోడ్డును తొలగించిన రబ్బిష్, రోడ్డుపక్కనే గుంతలు పెట్టి తీసిన మట్టిని, మురుగు కాలువల్లో తొలగించిన ప్లాస్టిక్ కవర్లతో కలిసిన మట్టిని రోడ్డుకు ఇరువైపులా మార్జిన్లకు వేయడంపై స్థానికులు విస్తుపోతున్నారు. కాగా, బుచ్చి - జొన్నవాడ మార్గంలో పాతరోడ్డుపైన ఒక లేయర్ వేసి చేతులు దులుపుకున్నారని, ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డు నిర్మాణంలో నాణ్యతను పరిశీలించి తగు చర్యలు తీసుకోవాలని పెనుబల్లి ఎంపీటీసీ సీహెచ్ వినయ్‌నారాయణ కోరారు.

హరివిల్లు పురస్కారాల ప్రదానం



ఉగాది పురస్కారం అందుకుంటున్న సినీనటుడు కిషోర్‌దాస్

నెల్లూరు (సాంస్కృతికం), ఏప్రిల్ 7 : నెల్లూరు పురమందిరంలో ఆదివారం రాత్రి హరివిల్లు క్రియేషన్స్ ఆధ్వర్యంలో ఉగాది పురస్కారాల ప్రదానోత్సవం కనుల పండువగా జరిగింది. ముఖ్య అతిథిగా సినీ నటుడు కిషోర్‌దాస్, అమరావతి కృష్ణారెడ్డి హాజరయ్యారు. వివిధ రంగాలకు చెందిన ముద్దపాటి విజయకుమార్, డాక్టర్ తిమ్మిరి రవీంద్ర, దండిగుంట శ్రీధర్, డేగల సాంబశివరావు, టీ రమణయ్య, జనార్దన్, శివవెంకట్, కరిముల్లా, జీ ప్రభాకర్, ముద్దు శ్రీనయ్య, వీ పూజలకు పురస్కారాలు అందజేశారు. సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. హరివిల్లు క్రియేషన్స్ దోర్నాల హరిబాబు, 25 కళాసంఘాల కన్వీనర్లు పర్యవేక్షించారు.

మేం వస్తే రూ.4వేల పింఛను..

● టీడీపీ ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు వీపీఆర్, కోటంరెడ్డి



ఏసీ స్టేడియంలో వాకర్స్‌తో కలసి నడుస్తూ ప్రచారం చేస్తున్న వీపీఆర్, కోటంరెడ్డి తదితరులు

నెల్లూరు(సిటీ), ఏప్రిల్ 7 : టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే వితంతువులు, వృద్ధులు, దివ్యాంగులతోపాటు వివిధ వర్గాల వారికి అందచేస్తున్న సామాజిక పింఛన్‌ను రూ. 4 వేలకు పెంచుతామని నెల్లూరు టీడీపీ ఎంపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, రూరల్ అభ్యర్థి కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి ప్రకటించారు. ఆదివారం నెల్లూరులోని ఏసీ స్టేడియంలో వాకర్స్ అసోసియేషన్ సభ్యులను కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. అనంతరం 18వ డివిజన్ సర్వేప ల్లి కాలువ కట్ట వద్ద చేపట్టిన ప్రచారంలో వారిద్దరు మాట్లాడారు. టీడీపీ అధికారంలోకి వచ్చి సీఎంగా చంద్రబాబు ప్రమాణస్వీకారం చేసిన వెంటనే పింఛన్ రూ.4 వేలు చేయడంతోపాటు జూలై పింఛన్ తోపాటు ఏప్రిల్, మే, జూన్ నెలలది కలిపి మొత్తం ఒకేసారి ఇస్తామని చెప్పారు. నెల్లూరు రూరల్ నియోజకవర్గంలో ప్రజలకు ఏ చిన్న సమస్య వచ్చిన తాము అండగా నిలుస్తామని వారు హామీ ఇచ్చారు. కరెంట్ బిల్లులు తగ్గించే అవకాశం తమ ప్రభుత్వంలో ఉంటుందని తెలిపారు. అనంతరం గాంధీనగర్‌లో ముస్లింలు, బడ్వాడీపాళెంలో రజకులతో వీపీఆర్ ఆత్మీయ సమావేశాలు నిర్వహించారు. టీడీపీకి మద్దతు ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేత కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి, పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

● **టీడీపీలో చేరికలు**

నెల్లూరు రూరల్ మండలంలోని దొంతాలి గ్రామానికి చెందిన శ్రీపతి పెద్దవెంకయ్య, అబ్బయ్య, వెంకట శేషయ్య, చిన్నవెంకయ్య, కరుణాకర్, వెంకటేశ్వర్లుకు టీడీపీ కండువా కప్పిన కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి వారిని పార్టీలోకి ఆహ్వానించారు. అలాగే నగరంలోని 30వ డివిజన్ వైఎస్ఆర్ నగర్‌కు చెందిన బూసిరాజు పవన్ గాంధీ, నల్లు మధు మిత్రబృందాన్ని కూడా పార్టీలో చేర్చుకున్నారు. 32వ డివిజన్ సంజయ్‌గాంధీ నగర్‌లో అగ్ని అభిషేక ప్రార్థన మందిరంలో క్రైస్తవులతో కలిసి ప్రార్థనల్లో పాల్గొన్నారు.

ప్రజల నిర్ణయమే శిరోధార్యం

● టీడీపీ సిటీ అభ్యర్థి పొంగూరు నారాయణ



పార్టీలో చేరికల సందర్భంగా మాట్లాడుతున్న నారాయణ

నెల్లూరు (విద్య), ఏప్రిల్ 7 : ప్రజాసేవే లక్ష్యంగా పనిచేసే తమకు ప్రజల నిర్ణయమే శిరోధార్యమని మాజీ మంత్రి, టీడీపీ నెల్లూరు నగర ఎమ్మెల్యే అభ్యర్థి పొంగూరు నారాయణ తెలిపారు. నగరంలోని 45వ డివిజన్‌లో ఆదివారం ఆయన పర్యటించారు. డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్ యాదవ్ ఆధ్వర్యంలో వైసీపీకి చెందిన నేతలు, కార్యకర్తలు పెద్ద ఎత్తున తెలుగుదేశం పార్టీలో చేరారు. అందరి ఆశయాలకు అనుగుణంగానే పార్టీ పనిచేస్తుందని, ఏ నిర్ణయమైనా ప్రజలతో చర్చించి వారికి సౌకర్యవంతంగా ఉంటేనే అమలు చేస్తామని చెప్పారు. పేదలకు ఇళ్లు నిర్మించడమే తమకు తెలుసని, వైసీపీ నేతల్లాగ కూల్చివేయడం తమకు రాదన్నారు. తనను ఎమ్మెల్యేగా, ఎంపీగా వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిని గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, తాళ్లపాక అనూరాధ, దార్ల వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు. అలాగే 46వ డివిజన్‌లోనూ నారాయణ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. విష్ణు అవతార్(బాబా రాందేవ్ ఆలయం) ఆలయాన్ని సందర్శించారు. ఆయన మాట్లాడుతూ టీడీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత వ్యాపారులు ప్రశాంత వాతావరణంలో జీవించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

● ముస్లిం మైనార్టీల సంక్షేమానికి తెలుగుదేశం పార్టీ కృషి చేస్తుందని పొంగూరు నారాయణ తెలిపారు. కార్పొరేటర్ ఇంతియాజ్ ఆధ్వర్యంలో నగరంలోని వీబీఎస్ కల్యాణ మండపంలో జరిగిన ఇఫ్తార్ విందులో నారాయణ పాల్గొన్నారు. ఎంపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, నెల్లూరు పార్లమెంట్ టీడీపీ అధ్యక్షుడు అబ్దుల్‌అజీజ్ తదితరులు పాల్గొన్నారు.

పాలకులు మారినా మారని ముదిరాజ్ బతుకులు


● ముదిరాజ్ మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు రఘురామ్



రాజీనామా లేఖను విలేకరులకు చూపిస్తున్న రఘురామ్ ముదిరాజ్

నెల్లూరు (వీఆర్సీ), ఏప్రిల్ 7 : దేశంలో పాలకులు ఎందరు మారినా ముదిరాజ్ కుల ప్రజల బతుకులు మారనేలేదని, రాజకీయాలకు అసలు నోచుకోలేదని ముదిరాజ్ మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు కనకట్ల రఘురామ్ ముదిరాజ్ ఆవేదన వ్యక్తం చేశారు. నగరంలోని కిలారి తిరుపతి నాయుడు కల్యాణ మండపంలో ఆదివారం ముదిరాజ్ మహాసభ ముఖ్య కార్యకర్తల సమావేశం ఏర్పాటు చేశారు. భవిష్యత్ కార్యాచరణపై చర్చించారు. అనంతరం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వంలో కులాలకు కార్పొరేషన్లు ఏర్పాటు చేసినా వాటికి నిధులు, విధులు లేక నీరసించిపోయాయని విమర్శించారు. ముదిరాజ్‌లు రాష్ట్రంలో రాజకీయంగా, ఆర్థికంగా, విద్య, ఉద్యోగాలలో చాలా వెనుకబడి ఉన్నారన్నారు. ఈ సమావేశంలో జిల్లా అధ్యక్షుడు గంపల అనిల్‌కుమార్, నగర అధ్యక్షుడు చెంచయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి నరసింహులు, భాస్కర్, తిరుపాలు ,శివకృష్ణ, వాసు, విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు. కాగా, రఘురామ్ ముదిరాజ్ కాంగ్రెస్ పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి పదవులకు రాజీనామా చేసినట్లు ప్రకటించారు.

'కృష్ణచైతన్య'లో మెగా ఉద్యోగ మేళా



ఎంపికైన విద్యార్థులతో కళాశాల సిబ్బంది

నెల్లూరు (విద్య), ఏప్రిల్ 7 : కృష్ణచైతన్య ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ కళాశా లలో ఆదివారం మెగా ఉద్యోగ మేళా నిర్వహించారు. కళాశాల డైరెక్టర్లు డాక్టర్ ఆర్‌వీ కృష్ణారెడ్డి, పీ రానా ప్రమోద్ రెడ్డి మాట్లాడుతూ విద్యా ర్థులకు ఉత్తమ విద్యతోపాటు ఉద్యోగావ కాశాలు కల్పించాలన్న లక్ష్యంతో జాబ్ మేళాలను క్రమం తప్పకుండా నిర్వహిస్తున్నామని చెప్పారు. మేళాలో 16 సంస్థలు పాల్గొన్నాయన్నారు. కార్యక్రమంలో డీన్లు డాక్టర్ యూ మల్లికార్జునయ్య, టీ జ్యోతి, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం ప్రసాద్, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ డీ భానుచంద్రారెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

బ్రాహ్మణుల కోసం ప్రత్యేక అట్రాసిటీ చట్టం చేయాలి

● బ్రాహ్మణ ఐక్య వేదిక



బ్రాహ్మణ క్రెడిట్ సొసైటీ మాజీ డైరెక్టర్ సుధా రవీంద్రను సన్మానిస్తున్న రామలింగేశ్వరరావు

నెల్లూరు (సాంస్కృతికం), ఏప్రిల్ 7 : బ్రాహ్మణుల కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక అట్రాసిటీ చట్టాన్ని చేయాలని పూర్వపు శ్రీఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బ్రాహ్మణసేవా సంఘం, నెల్లూరు సిటీ బ్రాహ్మణ ఐక్య వేదిక డిమాండ్ చేశాయి. ఆదివారం బాలాజీనగర్ త్యాగరాజస్వామి కల్యాణ మండపంలో బ్రాహ్మణ అట్రాసిటీ చట్ట పోరాట సభ జరిగింది. పూర్వపు శ్రీఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు అవధానం సాయికుమార్, ప్రముఖ రచయిత జొన్నవిత్తుల రామలింగేశ్వరరావు, బ్రాహ్మణ కార్పొరేషన్ క్రెడిట్ సొసైటీ మాజీ డైరెక్టర్ సుధా రవీంద్ర, డాక్టర్ జేవీ రామమోహన్‌రావు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. దేశవ్యాప్తంగా బ్రాహ్మణులపై జరుగుతున్న దాడులు, ఇతర అంశాలపై వక్తలు ఆందోళన వ్యక్తం చేశారు. బ్రాహ్మణుల మనుగడకు ప్రత్యేక అట్రాసిటీ చట్టం తీసుకురావాలని తీర్మానం చేశారు. జొన్నవిత్తుల మాట్లాడుతూ ప్రస్తుత ఎన్నికల్లో గెలుపోటములను నిర్ణయించేది బ్రాహ్మణులేనని, బ్రాహ్మణులు ఐక్యంగా ఉండాలని కోరారు. బ్రాహ్మణ కార్పొరేషన్‌ను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. వివిధ రంగాలలో రాణిస్తున్న వారిని సత్కరించారు. ఈ కార్యక్రమాన్ని జిల్లా శాఖ అధ్యక్షుడు మైలవరం మురళీమోహన్, ప్రధాన కార్యదర్శి జంగా శ్రీనివాసకుమార్, యువజన విభాగం అధ్యక్షుడు విష్ణుకుమార్, సంగం అధ్యక్షుడు శ్రీకంఠం రఘుకిషోర్, జిల్లా మహిళా ప్రధాన కార్యదర్శి రేవూరు విజయలక్ష్మి, బాలభవన్ డైరెక్టర్ సుభద్రాదేవి పాల్గొన్నారు.

రేపు రంగడికి ఉగాది వేడుకలు

నెల్లూరు (సాంస్కృతికం), ఏప్రిల్ 7 : తల్పగిరి రంగనాథస్వామి ఆలయంలో మంగళవారం ఉగాది వేడుకలు జరుగుతాయని ఆలయ ఈవో డబ్బుగుంట వెంకటేశ్వర్లు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 7.30 గంటలకు శ్రీదేవి, భూదేవి సమేత రంగనాథ స్వామికి తిరు మంజనం, సాయంత్రం 5.30 గంటలకు పంచాంగ శ్రవణం, 6.30 గంటలకు పేట ఉత్సవం జరుగుతాయని, భక్తులందరూ తరలిరావాలని కోరారు.

కన్యకాపరమేశ్వరికి సారె

నగరంలోని స్టోన్‌హౌస్‌పేట వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో ఉగాది సారె కార్యక్రమం జరుగుతుందని ఆలయం చైర్మన్ శ్రీరాం సురేష్ తెలిపారు. భక్తులు అమ్మవారికి ఉగాది సారె సమర్పించుకోవచ్చని తెలిపారు.

రాజరాజేశ్వరి ఆలయంలో...

నగరంలోని రాజరాజేశ్వరి అమ్మవారి ఆలయంలో మంగళవారం ఉగాది వేడుకలు నిర్వహిస్తున్నట్లు ఆలయ సహాయ కమిషనర్ వెంకట సుబ్బయ్య ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం అమ్మవారికి అభిషేకం, చండీహోమం, పంచాంగ శ్రవణం జరుగుతాయని తెలిపారు. సుందరేశ్వర స్వామి ఆలయంలో వార్షికోత్సవం సందర్భంగా ఉదయం మహాన్యాస పూర్వక రుద్రాభిషేకాలు జరుగుతాయన్నారు. సాయంత్రం విశేష పూలంగిసేవ, పల్లకిలో రాజరాజేశ్వరి అమ్మవారి ప్రాకారోత్సవం జరుగుతాయని, భక్తులందరూ తరలిరావాలని కోరారు.

అలరించిన ఉగాది కవి సమ్మేళనం

నెల్లూరు (సాంస్కృతికం), ఏప్రిల్ 7 : నగరంలోని మనం ఆసుపత్రిలో ఆదివారం పెన్నా రచయితల సంఘం ఆధ్వర్యంలో జరిగిన ఉగాది కవి సమ్మేళనం అలరించింది. కవులు శ్రీక్రోధి నామ సంవత్సరాన్ని ఆహ్వానిస్తూ కవితా గానం చేశారు. పెరసం అధ్యక్షురాలు జీ సుభద్రాదేవి, కార్యదర్శి అవ్వారు శ్రీధర్‌బాబు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పోలవరపు లక్ష్మీనరసింహారావు, పీ శివకుమార్, జీ ఉషారాణి, ఏ జయప్రకాష్, డీ ప్రసూనశరత్, మోహూరు పెంచల నరసింహం, జీ శివకుమార్, హస్తి లక్ష్మణ్‌రాజు, ఎం నరేంద్ర, మాధవ సుధ పాల్గొన్నారు. పలువురు కవులను సత్కరించారు. అనంతరం జరిగిన సమావేశంలో గోవిందరాజుల సుభద్రాదేవి, తోట సులోచన అధ్యక్ష, కార్యదర్శులుగా ఎన్నికయ్యారు.

వడదెబ్బతో జాగ్రత్త

నెల్లూరు(వైద్యం), ఏప్రిల్ 7 : వేసవి తీవ్రత కారణంగా వడదెబ్బ బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని నారాయణ మెడికల్ గ్రూప్ ఏజీఎం చౌకచర్ల భాస్కర్‌రెడ్డి వెల్లడించారు. ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా ఆదివారం బుజ బుజనెల్లూరులోని పీఎంపీ కార్యాలయంలో పీహెచ్‌సీ అసోసియేషన్ ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఎండ తీవ్రత మెదడుపై ప్రభావం చూపడంతో వడదెబ్బకు గురవుతారన్నారు. వృద్ధులు, చిన్నారులు, బాలింతలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని తెలియచేశారు. అనంతరం వడదెబ్బ సంభవించకుండా జాగ్రత్త పడదాం... మరణాలు అరికడతాం అన్న నినాదంతో రూపొందించిన కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పీఎంపీ సంఘం గౌరవా ధ్యక్షుడు జయప్రకాష్, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు శాఖవరపు వేణుగోపాల్, గోరంట్ల శేషయ్య, రూడ్స్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ షేక్ రసూల్, దేవరకొండ శ్రీనివాసులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సేవలు ప్రశంసనీయం



చలివేంద్రం ప్రారంభిస్తున్న ఇన్‌స్పెక్టర్ వెంకట నారాయణ

నెల్లూరు (విద్య), ఏప్రిల్ 7 : నగరంలోని దర్గామిట్ట జడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన పూర్వవిద్యార్థులు ఏర్పాటు చేసిన 91 ఫౌండేషన్ సేవలు ప్రశంసనీయమని వేదాయపాళెం ఇన్‌స్పెక్టర్ వెంకట నారాయణ కొనియాడారు. ఆదివారం పాఠశాల వద్ద ఫౌండేషన్ ఏర్పాటు చేసిన మజ్జిగ చలివేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. జడ్పీ పాఠశాలలో 1990-91 వరకు చదువుకున్న విద్యార్థులంతా కలిసి ఆరేళ్లగా సేవా కార్యక్రమాలు చేస్తున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ అధ్యక్షుడు బోయళ్ల కృష్ణారెడ్డి, సభ్యులు పాల్గొన్నారు.

ఏ బిడ్డా.. మంగళం మా అడ్డా!

రెచ్చిపోతున్న ఎర్రదొంగలు



వ్యవసాయం సహా ప్రతి వృత్తికీ ఒక సీజన్ అంటూ ఉంటుంది. చివరికి దొంగలు కూడా ఎండాకాలం రాగానే జోరు పెంచుతారు. ఒక్క ఎర్రదొంగలు మాత్రమే సీజన్‌లెస్ స్మగ్లింగ్‌తో రెచ్చిపోతున్నారు. ఎన్నికల కోడ్ అడ్డు కూడా లేదు. అధికారులు, నాయకులు, ప్రజలు సకల వర్గాలూ ఎన్నికల హోరులో మునిగి తేలుతుండగా ఎర్రచందనం దొంగలు మాత్రం దర్జాగా దుంగలను అడవి దాటించే పనులు సాగిస్తున్నారు. తిరుపతి నగరంలోని మంగళం ప్రాంతం వీరికి ప్రధాన అడ్డాగా కొనసాగుతోంది.

- రాత్రి చందనం, పగలు గంజాయి
- భయాందోళనకు గురవుతున్న ప్రజలు

మంగళం, ఏప్రిల్ 7 : తిరుపతి నగర శివారు ప్రాంతాలైన మంగళం ప్రాంతంలో అడవి అంచున ఉండే భూపాల్ హౌసింగ్ కాలనీ, వెంకటేశ్వర కాలనీ, తిమ్మినాయుడుపాళెం ప్రాంతాల్లో రాత్రి 11 నుంచీ అపరిచితుల కదలికలు మొదలవుతాయి. చేతిలో టార్చిలైట్లు, గొడ్డళ్లు, ఇతర సామగ్రి వీరి వద్ద ఉంటుంది. ముందుగా 20 నుంచి 30మంది శేషాచలం కొండల్లోకి అడుగుపెడతారు. కొండల్లో అంతా సేఫ్ అని సమాచారం ఇచ్చాక మిగిలినవాళ్లు కొండల్లోకి నడక మొదలు పెడతారు. తెల్లవారు జామున మళ్లీ కదలికలు పెరుగుతాయి. ఎర్రచందనం దుంగలను చిన్నచిన్న ముక్కలుగా చేసి బయటకు తెస్తారు. అప్పటికే సిద్ధంగా ఉన్న బైక్‌లు, కార్లు, జీపుల ద్వారా అవి లక్ష్యం వైపు చేరుకుంటాయి. బీటీఆర్ కాలనీకి పైభాగాన కొండ పక్కన ఉన్న ఇళ్ల మధ్య ఈ కదలికలు మరీ ఎక్కువగా ఉంటున్నాయి. స్థానికులను భయాందోళనలకు గురిచేస్తున్నాయి.బీటీఆర్‌కాలనీ, మంగళం ప్రాంతాల్లో ఇళ్లు అద్దెకు తీసుకునే అపరిచితులు నెల రోజులుగా పెరిగారని తెలుస్తోంది.పెద్దపెద్దవాళ్లే దీని వెనుక ఉన్నారని అపరిచితులు టీ బంకులు దగ్గర అలా మాటలు వదులుతారు.దీంతో మనకెందుకులే అని జనం సమాచారం కూడా ఎవరికీ ఇవ్వరు. అయితే ఎర్ర దొంగలు పనిలో పనిగా గంజాయిని కూడా వ్యాప్తిలోకి తెస్తున్నారు. ఈ కాలనీల్లోని కుర్రాళ్లను పోగేసి గంజాయికి అలవాటు చేస్తున్నారని జనం ఆందోళన చెందుతున్నారు. అడవిలోంచి ఎర్ర దుంగలను బయటకు తరలించే వాహనాలే గంజాయిని తెస్తున్నాయని ప్రచారం జరుగుతోంది. ఎన్నికల వేళ నాయకులకూ డబ్బు అవసరాలు ఎక్కువ కాబట్టే ఎర్ర స్మగ్లింగ్ జోరు పెరిగింది అనే మాటలు ఈ ప్రాంతాల్లో వినిపిస్తున్నాయి.





శ్రీవారి ఆలయం ముందు జరుగుతున్న ఉగాది ఏర్పాట్లు

ఉగాది ఆస్థానానికి జోరుగా ఏర్పాట్లు

తిరుమల, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): తిరుమలలో ఉగాది ఆస్థానానికి ఏర్పాట్లు జోరుగా సాగుతున్నాయి. ఈనెల 9వ తేదీన ఉగాది ఆస్థానాన్ని టీటీడీ శాస్త్రోక్తంగా నిర్వహించనుంది.ముందుగా తెల్లవారుజామున 3 గంటలకు సుప్రభాత పఠనం తరువాత శుద్ధి నిర్వహిస్తారు. ఉదయం 6 గంటలకు శ్రీదేవి, భూదేవి సమేత మలయప్పస్వామికి, విష్వక్సేనుల వారికి విశేష సమర్పణ చేస్తారు. ఉదయం 7 నుంచి 9 గంటల మధ్య విమాన ప్రాకారం, ధ్వజస్తంభం చుట్టూ ఊరేగింపుగా ఆలయంలోకి ప్రవేశిస్తారు. తర్వాత శ్రీవారి మూలవిరాట్టు, ఉత్సవమూర్తులకు నూతన వస్త్రాలను ధరింపజేస్తారు. అనంతరం పంచాంగ శ్రవణం వుంటుంది. ఉగాది ఆస్థానాన్ని బంగారు వాకిలి వద్ద ఆగమ పండితులు, అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహిస్తారు. కాగా, ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని 9న ఆలయంలో నిర్వహించే ఆర్జితసేవలైన అష్టదళపాదపద్మారాధన, కళ్యాణోత్సవం, ఊంజల్‌సేవ, ఆర్జిత బ్రహ్మోత్సవ సేవలను టీటీడీ రద్దు చేసింది.

10 టన్నుల పుష్పాలతో అలంకరణ

ఉగాది సందర్భంగా తిరుమల క్షేత్రాన్ని పది టన్నుల సంప్రదాయ పుష్పాలతో టీటీడీ అలంకరిస్తోంది. శ్రీవారి ఆలయంలో 5 టన్నులు, ఆలయం వెలుపల మరో 5 టన్నుల పుష్పాలను అలంకరణకు వినియోగించనుంది. అలాగే 60 వేల కట్ ఫ్లవర్స్‌ను ఆలయంలోని ధ్వజస్తంభం, బలిపీఠం,మండపాల స్తంభాలకు అలంకరణలో వినియోగించనున్నారు. భక్తులను ఆకట్టుకునేలా శ్రీవారి ఆలయం ముందు మత్స్యావతారంతో పాటు పలు అవతారాల ప్రతిమలను ఏర్పాటు చేస్తున్నారు. అలాగే యుగాల సెట్టింగు పనులను కూడా ఆదివారం ఉదయం ప్రారంభించారు. మరోవైపు ఆలయంలోని అద్దాలమండపం వద్ద అయోధ్యరాముడి సెట్టింగ్ పనులను చేపట్టనున్నారు. ముఖ్యంగా నవధాన్యాలతో కూడా మత్స్యావతారాన్ని ధ్వజస్తంభం వద్ద ఏర్పాటు చేయనున్నారు.విద్యుత్ అలంకరణ పనులనూ మొదలుపెట్టారు. సోమవారం రాత్రి 10 గంటలలోపు సంప్రదాయ కళ ఉట్టిపడేలా ఈ అలంకరణలన్నీ పూర్తిచేయనున్నారు.

మండిపోతున్న భానుడు

గూడూరు, సూళ్ళూరుపేటల్లో 44.8డిగ్రీలు

20 మండలాల్లో 40 డిగ్రీలు దాటిన ఉష్ణోగ్రతలు



గొడుగు లేకుంటే బయటకు రాలేం



తిరుచానూరు సమీపంలోని శిల్పారామం వద్ద ఇదీ పరిస్థితి

ఎండల దెబ్బకు తిరుపతిలో నిర్మానుష్యంగా కన్పిస్తున్న లక్ష్మీపురం సర్కిల్



తిరుపతి(కలెక్టరేట్), ఏప్రిల్ 7: ఏప్రిల్ మొదటి వారంలోనే భానుడు తన ప్రతాపం చూపిస్తున్నాడు. వడగాల్పులు, ఉక్కపోతతో జిల్లావ్యాప్తంగా ప్రజలు అల్లాడిపోతున్నారు. ఇటీవల వాతావరణంలో వచ్చిన పెనుమార్పులే దీనికి కారణమని శాస్త్రవేత్తలంటున్నారు. మరో రెండ్రోజుల పాటూ ఎండలు ఇలాగే ఉంటాయంటున్నారు. ఉదయం 8 గంటల నుంచే వేడి వాతావరణం మొదలవుతోంది. సాయంత్రం 5 గంటల వరకు బయటకు రావాలంటే జనం భయపడుతున్నారు. ఆదివారం జిల్లాలో రికార్డుస్థాయిలో ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.20 మండలాలకు పైగా 40 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.గూడూరులో 44.8డిగ్రీలు, సూళ్ళూరుపేటలో 44.7, చిల్లకూరులో 44.2, పిచ్చాటూరులో 43.8, తొట్టంబేడులో 43.7, నాయుడుపేటలో 43.5, దక్కిలిలో 43.3, కోట, ఓజిలి మండలాల్లో 42.9, చిన్నగొట్టిగల్లు, వెంకటగిరి, డీవీ సత్రం మండలాల్లో 42.8డిగ్రీలు, తిరుపతి, ఎర్రావారిపాళెం, ఆర్సీపురం మండలాల్లో 42.6డిగ్రీలు, శ్రీకాళహస్తిలో 42.4, పాకాల, నారాయణవనం, పుత్తూరు 42.3, చిట్టమూరు 41.8, రేణిగుంట 41.7, నాగలాపురం మండలాల్లో 40.6డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.కనిష్ట ఉష్ణోగ్రతలు సైతం 39.9డిగ్రీలు నమోదవడం చూస్తుంటే రానానూ ఎండల తీవ్ర ఎలా ఉంటుందో అని ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారు.

సబ్ రిజిస్ట్రార్ అయిపోతానంటూ రూ. లక్షల్లో వసూళ్లు

లబోదిబోమంటున్న భాదితులు

తిరుపతి, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): తిరుపతి జిల్లా పరిధిలోని రిజిస్ట్రేషన్ శాఖలో పనిచేస్తున్న ఓ సీనియర్ అసిస్టెంట్ త్వరలో సబ్ రిజిస్ట్రార్ (ఎస్ఆర్) అవుతానంటూ వసూళ్లకు పాల్పడినట్టు ఆరోపణలు గుప్పుమంటున్నాయి. గతంలో దీర్ఘకాలిక సెలవు పెట్టి అనేక వివాదాలతో పాటు గుప్తనిధుల వెలికితీత, రైస్‌పుల్లింగ్ వంటి వ్యవహారాల్లో వేలుపెట్టి పీకల్లోతు అప్పుల్లో కూరుకుపోయిన ఆయన తాజాగా కొత్త మోసానికి తెర లేపినట్టు సమాచారం. సీనియారిటీ ప్రకారం తనకన్నా ముందు వరుసలో జిల్లాలో పదిమందికి పైగా సీనియర్ అసిస్టెంట్లు ప్రమోషన్ జాబితాలో వేచివున్నప్పటికీ వారందరినీ పక్కకు నెట్టి తాను సబ్ రిజిస్ట్రార్ ప్రమోషన్ తెచ్చుకుంటానని నాలుగు నెలల క్రితమే ప్రచారం మొదలు పెట్టినట్టు తెలిసింది.నిషేధిత జాబితాలోని దేవదాయ,మఠం, ప్రభుత్వ, డీకేటీ భూములతో పాటు పలు వివాదాల్లో ఉన్న ఆస్తులను రిజిస్ట్రేషన్ చేసేస్తానని నగరంలోని రియల్ ఎస్టేట్ వ్యాపారులకు, బిల్డర్లకు, కొందరు డాక్యుమెంటు రైటర్లకు ఆశపెట్టినట్టు తెలుస్తోంది.తన ప్రమోషన్ కోసం సుమారు కోటి రూపాయల వరకు పై అధికారులకు సమర్పించాలని , తలా పది ,ఐదు లక్షలు సర్దుబాటు చెయ్యాలని నాలుగు నెలలుగా వసూళ్లు ప్రారంభించినట్టు చెబుతున్నారు. ఇతని మాటలు నమ్మిన కొందరు రూ.లక్షల్లో డబ్బులు సమర్పించుకున్నారు.చివరకు ప్రమోషన్ అయ్యే పనికాదని తెలుసుకున్న డబ్బులిచ్చిన వారు రిజిస్ట్రార్ కార్యాలయం చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు.

పిచ్చికుక్క కరిచి వృద్ధురాలి మృతి



పిచ్చికుక్క దాడిలో మృతి చెందిన సైదాన్‌బీ ఎడమచేతికి ఆపరేషన్ చేసి కుట్టువేసిన దృశ్యం

రేణిగుంట, ఏప్రిల్ 7: పిచ్చికుక్క కరిచి ఒక వృద్ధురాలు మృతి చెందిన ఘటన రేణిగుంట బుగ్గవీధిలో చోటు చేసుకుంది.బుగ్గవీధిలో నివాసముండే తల్లీకొడుకులు సైదాన్‌బీ(78),హుస్సేన్ కూలి పనులతో జీవనం సాగిస్తుంటారు.సైదాన్‌బీకి ఇటీవల కాలు విరిగిపోవడంతో కర్ర సాయంతో నడుస్తుంటోంది. ఈ నెల నాల్గవ తేదీ సాయంత్రం తన ఇంటి చివర్లో బహిర్భూమికి వెళ్లగా ఓ పిచ్చికుక్క సైదాన్‌బీని ఎడమచెయ్యి మణికట్టుతో పాటు పలు చోట్ల శరీరంపై కరిచేసింది.దీంతో కిందపడిపోయిన సైదాన్‌బీ వయసు మీరడంతో పెద్దగా అరవలేకపోయింది. బహిర్భూమికని వచ్చిన మరో వ్యక్తి అక్కడ పడిఉన్న సైదాన్‌బీని చూసి కుమారుడికి సమాచారం ఇచ్చాడు. దీంతో ఆమెను హుటాహుటిన స్థానికంగా వున్న ఓ ప్రైవేటు ఆస్పత్రికి తీసుకెళ్లగా ఇంజక్షన్‌తో పాటు కుట్లు వేయించారు. తీవ్రమైన నొప్పితో సైదాన్‌బీ ఇబ్బంది పడుతుండడంతో 6వతేదీ వుదయం తిరుపతి రుయాస్పత్రిలో చేర్చారు. అక్కడ ఈసీ, స్కానింగ్ తీసి చేతికి ఆపరేషన్ నిర్వహించి కట్టుకట్టారు.ఆదివారం మధ్యాహ్నం 3గంటలకు చికిత్స పొందుతూ సైదాన్‌బీ మృతి చెందింది. సైదాన్‌బీని కరిచిన పిచ్చికుక్క ఇప్పటికి రెండు మూడు వీధుల్లో తిరుగుతూ ఏడుగురిని కరిచిందని తెలియడంతో ప్రజలు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఈదులగుంట చెరువుకు చెర

- శ్రీకాళహస్తిలో బరితెగించిన భూ బకాసురులు
- పట్టపగలే పూడ్చి వేస్తున్నా పట్టని అధికారులు



ఈదులగుంట చెరువు చదును పనులు

శ్రీకాళహస్తి, ఏప్రిల్ 7:శ్రీకాళహస్తిలో కబ్జారాయుళ్ల ఆగడాలకు అంతులేకుండా పోతోంది. ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చింది కదా.... అధికారుల సహకారం లేక అక్రమార్కులు సద్దుమణుగుతారని భావించిన పట్టణవాసులకు అది కేవలం ఆశగానే మిగిలింది. శ్రీకాళహస్తి పట్టణ శివారులోని ఎల్ఐసీ కాలనీకి ఆనుకుని సుమారు 20.25 ఎకరాల విస్తీర్ణంలో ఈదులగుంట చెరువు ఉంది. తొట్టంబేడు రెవిన్యూ పరిధిలో ఉన్న ఈ భూమిని శ్రీకాళహస్తి పురపాలక సంఘంలో విలీనం చేసే ప్రక్రియ తుది దశలో ఉంది. పట్టణం విస్తరించడంతో ఈదులగుంట ప్రాంతంలో భూముల ధరలకు భారీగా డిమాండ్ ఏర్పడింది. దానికి తోడు మున్సిపాలిటీలో విలీన ప్రతిపాదన కూడా వుండడంతో ఎకరా సుమారు రూ.8 కోట్లకు పైగా పలుకుతోంది. దీంతో 20.25 ఎకరాల చెరువు భూమిని మింగేసేందుకు కొందరు నాయకులు బరితెగించారు.ఇక్కడకు సమీపంలో ప్రభుత్వ పురుషుల డిగ్రీ కాలేజీకి ఎదురుగా మూడేళ్ల క్రితం పిచ్చాటూరు రహదారికి ఆనుకుని ఉన్న ప్రభుత్వ భూమిని అధికార పార్టీ నాయకుడు కబ్జా చేశారు. దీనిపై మూడేళ్ల నుంచి స్థానికులు తిరుగుబాటు చేస్తూనే ఉన్నారు.



పిచ్చాటూరు రహదారికి ఆనుకుని జరుగుతున్న అక్రమ నిర్మాణాలు

ఇక్కడకు అత్యంత సమీపంలోనే ఈదులగుంట చెరువు భూమి ఉంది. తాజాగా శనివారం రాత్రి చెరువులో మట్టి వ్యర్థాలను తోలించారు. ఆదివారం యంత్రాలతో కొందరు రంగంలోకి దిగి చెరువులో పట్టపగలు చదును చేసే పనులను చేపట్టారు. ఇది చూసిన స్థానికులు నివ్వెర పోయారు.

రాజీవ్‌నగర్‌లో కబ్జాల జాతర

20 రోజుల నుంచి శ్రీకాళహస్తి పట్టణ శివారులోని రాజీవ్‌నగర్‌లో కబ్జాల జాతర సాగుతోంది. ఇటీవల పెద్ద సంఖ్యలో అధికార పార్టీని వీడి టీడీపీలో చేరికలు జరిగాయి. వలసలను అరికట్టేందుకు వైసీపీ నాయకులు రాజీవ్‌నగర్ కాలనీని కేంద్రంగా మార్చుకున్నారు. ఇక్కడ నిరుపేద లబ్ధిదారుల స్థలాలపై కన్నేశారు. అధికారుల అండతో ఖాళీగా ఉన్న సుమారు 1200 ప్లాట్ల జాబితాను సిద్ధం చేసుకున్నారు. వాటిని రహస్యంగా ఎన్నికల్లో అధికార పార్టీకి సహకరించే వారికి సమర్పిస్తున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.ఇందుకు అనుగుణంగానే రాజీవ్‌నగర్‌లో ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చినప్పటి నుంచీ అక్రమ నిర్మాణాలు జోరందుకున్నాయి. రాత్రి సమయాల్లో అయితే ఖాళీ జాగాల్లో యంత్రాలు యుద్ధప్రాతిపదికన తవ్వేస్తున్నాయి. పథకం ప్రకారం రాజీవ్‌నగర్ కాలనీని ఎరగావేసి అధికార పార్టీ నేతలు ఎన్నికలకు అనుకూలంగా మార్చుకుంటున్నారు.

రూ.10కోట్ల ప్రభుత్వ భూమికి చేటు

రాజీవ్‌నగర్ వద్ద పిచ్చాటూరు రహదారికి ఆనుకుని భవిష్యత్తు రోడ్డు విస్తరణ కోసం స్థలాన్ని గతంలో విడిచిపెట్టారు.అయితే ఈ స్థలాన్నీ కబ్జాదారులు చెరబట్టారు. సుమారు 12 కిలోమీటర్ల పొడవునా రహదారికి ఆనుకుని అక్రమ కట్టడాలు జోరందుకున్నాయి. అధికారులు, పాలకులతో పాటు కొందరు మీడియా సిబ్బంది ప్రధాన రహదారి పక్కనే ఉన్న భూములను మాయం చేస్తున్నారు. సుమారు రూ. 10 కోట్ల విలువైన ప్రభుత్వ భూమిని స్వాహా చేస్తున్నారు.

తహసీల్దార్ శివప్రసాద్ ఆస్తులపై దర్యాప్తు ముమ్మరం

విచారణ అధికారిగా సెంట్రల్ ఇన్వెస్టిగేషన్ టీమ్ సీఐ

తిరుపతి(నేరవిభాగం), ఏప్రిల్ 7 : రేణిగుంట మాజీ తహసీల్దార్ శివప్రసాద్ ఆస్తులపై దర్యాప్తు ముమ్మరం చేశారు. విజయవాడలోని ఏసీబీ సీఐ రవీంద్ర దర్యాప్తు అధికారిగా నియమితులయ్యారు. ఇప్పటికే అరెస్టయి నెల్లూరు జైలులో ఉన్న శివప్రసాద్ రూ.70 కోట్ల వరకు అక్రమంగా ఆస్తులు కూడబెట్టినట్లు ఏసీబీ అధికారులు చెబుతున్నారు. మరింత లోతుగా దర్యాప్తు చేసేందుకు రవీంద్ర తిరుపతి, తిరుపతి రూరల్, పాకాల, బంగారుపాళెం, పీలేరు, కడప, రాయచోటి ప్రాంతాల్లోని సబ్ రిజిస్ట్రార్లు, బ్యాంకులకు లేఖలు రాసి వివరాలు సేకరిస్తున్నారు. 10 రోజుల్లో విచారణ పూర్తి చేసి, ప్రభుత్వానికి నివేదిక ఇవ్వనున్నారు.



రంజాన్ వేళలు

ఇఫ్తార్ (సోమవారం) : సా. 6.28

సహరి (మంగళవారం) : ఉ. 4.44

అక్రమాలపై ప్రశ్నించినందుకే దాడి

మెప్మా సీఎంఎం సౌజన్య



ఆస్పత్రిలో సీఎంఎం సౌజన్య

సూళ్లూరుపేట, ఏప్రిల్ 7: సూళ్లూరుపేట మెప్మాలో అక్రమాలపై ప్రశ్నించినందుకే తనపై దాడి చేశారని మెప్మా సిటీ మిషన్ మేనేజర్(సీఎంఎం) సౌజన్య మీడియా ఎదుట ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివారం ఆమె మాట్లాడుతూ మెప్మాతో సంబంధం లేని వ్యక్తులు బ్యాంకుకు వెళ్లి నగదు డ్రా చేస్తున్నారని, ఆ విషయాన్ని ప్రశ్నించినందుకే తనపై మెప్మా అధ్యక్షురాలు స్వప్న, ఆమె భర్త దయాకర్, అత్త గుణసుందరి, ఆర్పీలు కలిసి దాడి చేశారని సౌజన్య ఆరోపించారు. పొదుపు సంఘాలకు సంబంధించి నగదును బ్యాంకుల్లో అధికారులకు తెలియకుండా అధ్యక్షురాలు, ఆర్పీలు కలిసి డ్రా చేస్తున్నారని, ఈ విషయం తన దృష్టికి రావడంతో నివారించేందుకు ప్రయత్నం చేశానన్నారు. ఇదే విషయాన్ని మెప్మా పీడీ దృష్టికి కూడా తీసుకెళ్లినట్లు ఆమె తెలిపారు. తాను సూళ్లూరుపేటకు వచ్చి ఎనిమిది నెలలు అవుతోందని, మెప్మా ద్వారా గ్రూపులకు అందించే రుణాల్లో అనేక అక్రమాలు జరిగాయని, విచారణ చేస్తే బయటకు వస్తాయన్నారు. కాగా, మెప్మా అధ్యక్షురాలికి అధికార పార్టీ నాయకుల అండదండలు ఉండడంతో సంబంధం లేని విషయాల్లో జోక్యం చేసుకొంటూ అక్కడ పనిచేసే అధికారులపై పెత్తనం చలాయిస్తున్నట్లు విమర్శలున్నాయి. గతంలో కూడా ఇక్కడ పనిచేసిన సీఎంఎంలు ఒత్తిడి తట్టుకోలేక వెళ్లిపోయారు. ఇదే తరహాలో గతంలో కూడా ఒక ఉద్యోగిపై దాడి చేసిన సంఘటనలు ఉన్నాయి. నిబంధనల ప్రకారం మెప్మాలో రెండేళ్లు పూర్తయిన తరువాత అధ్యక్షురాలిని మార్చాల్సి ఉంది. అయితే నాలుగేళ్లయినా మార్చకుండా కాలయాపన చేస్తుండడం పట్ల విమర్శలు వినిపిస్తున్నాయి. ఇదిలా ఉండగా ఒక ఉద్యోగిపై కార్యాలయంలో బయట వ్యక్తులు దాడిచేస్తే స్పందించాల్సిన అధికారులు మౌనం దాల్చారు. పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితురాలు సౌజన్యను కొందరు అధికార పార్టీ నేతలు కలిసి రాజీకుదిర్చే ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలిసింది.

అసమర్థ పాలనతో రాష్ట్రం అధోగతి: పాశం



ఏకసిరి గ్రామంలో ప్రజలకు అభివాదం చేస్తున్న సునీల్‌కుమార్

చిట్టమూరు, ఏప్రిల్ 7: ముఖ్యమంత్రి జగన్ అసమర్థ పాలనతో రాష్ట్రం అధోగతి పాలైందని గూడూరు నియోజకవర్గ టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పాశం సునీల్‌కుమార్ అన్నారు. ఆదివారం మండలంలోని ఏకసిరి గ్రామంలో టీడీపీ మండల అధ్యక్షుడు గణపర్తి కిషోర్‌నాయుడు ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా సునీల్‌కుమార్ మాట్లాడుతూ వైసీపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి రాష్ట్రంలో హత్యలు, దౌర్జన్యాలు, దోపిడీ పాలన సాగుతోందన్నారు. దోచుకుంటున్నారే తప్ప రాష్ట్ర అభివృద్ధి గురించి పట్టించుకునే నాథుడేలేడని విమర్శించారు. టీడీపీ పాలనలో ఏకసిరి గ్రామంలో రూ.9.15 కోట్లతో వివిధ అభివృద్ధి పనులు చేశామని గుర్తు చేశారు. అదేవిధంగా రూ.74.80 కోట్లతో 16 సిమెంటు రోడ్లు వేసిన ఘనత టీడీపీ ప్రభుత్వానిదేనని అన్నారు. ఐదేళ్ల వైసీపీ పాలనలో పిడికెడు మట్టి వేయలేదన్నారు. టీడీపీ అధికారంలోకి రాగానే అమలు పరిచే సూపర్ సిక్స్ పథకాల గురించి తెలియజేస్తూ కరపత్రాలు అందజేశారు. ఏకసిరి గ్రామస్తులు సునీల్‌కుమార్‌కు స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో స్థానిక టీడీపీ నాయకులు అబ్బయ్యనాయుడు, బసివరెడ్డి హరికృష్ణారెడ్డి, గుంపర్ల చిన్నారావు, శ్రీనివాసులనాయుడు, అనురాధ, టీడీపీ సీనియర్ నాయకులు మస్తాన్‌రెడ్డి, రాజగోపాల్ రెడ్డి, సునీల్‌రెడ్డి, మాజీ జట్పీటీసీ భారతమ్మ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీతోనే సంక్షేమం, అభివృద్ధి: నెలవల



టీడీపీలో చేరిన యువకులతో నెలవల సుబ్రహ్మణ్యం

నాయుడుపేట టౌన్, ఏప్రిల్ 7: టీడీపీతోనే సంక్షేమం, అభివృద్ధి సాధ్యమవుతుందని సూళ్లూరుపేట నియోజకవర్గ ఇన్‌చార్జి నెలవల సుబ్రహ్మణ్యం అన్నారు. ఆదివారం పెళ్లకూరు మండలం చెన్నప్పనాయుడుపేట గ్రామానికి చెందిన 50 కుటుంబాలు టీడీపీ నేత వేలూరు హరిబాబురెడ్డి ఆధ్వర్యంలో పార్టీలో చేరాయి. వారికి నెలవల సుబ్రహ్మణ్యం పార్టీ కండువకప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగన్ పాదయాత్ర సమయంలో యువతకు ఉద్యోగావకాశాలు కల్పిస్తామని హామీ ఇచ్చి, అధికారంలోకి వచ్చాక మోసం చేశారని విమర్శించారు. రాష్ట్రంలో యువతకు ఉద్యోగాలు కావాలంటే చంద్రబాబును ముఖ్యమంత్రి చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు వేలూరు మురళీకృష్ణారెడ్డి, సంచి కృష్ణయ్య, రవి, గంగయ్య, హరి, అనిల్, ప్రవీణ్, తేజ, చిరంజీవి, శేఖర్, యువరాజ్, గురవయ్య, అశోక్‌కుమార్, వెంకటయ్య, తదితరులు పాల్గొన్నారు.

టీడీపీలో చేరికలు

సూళ్లూరుపేట, ఏప్రిల్ 7: పట్టణంలోని ఫ్లైఓవర్ వద్దనున్న రైస్‌మిల్లులో తెలుగు యువత ఆధ్వర్యంలో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపాలిటీ పరిధిలోని మన్నారుపోలూరు, కోళ్లమిట్ట, బాపూజీ వీధి, ఇందిరానగర్, కోళ్లమిట్ట తదితర ప్రాంతాల నుంచి పెద్దసంఖ్యలో యువత టీడీపీలో చేరారు. వారికి నెలవల సుబ్రహ్మణ్యం, వేనాటి సతీష్ రెడ్డి పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. అంతకుముందు పార్టీ కార్యాలయం నుంచి టీడీపీ శ్రేణులు బాపూజీ వీధుల్లో ర్యాలీ నిర్వహించారు.

ఒలింపియాడ్ పరీక్షల్లో విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న కిషోర్ తదితరులు

కోట, ఏప్రిల్ 7: కోటలోని ప్రగతి విద్యానికేతన్ పాఠశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి ఒలింపియాడ్ పరీక్షల్లో ప్రతిభ చూపారు. పాఠశాలకు చెందిన 11మంది విద్యార్థులు 16రాష్ట్రస్థాయి ర్యాంకులు సాధించారు. ఆదివారంఆయా విద్యార్థులను విద్యాసంస్థల చైర్మన్ పసుపులేటి కిషోర్ షీల్డ్‌లు, మెమెంటోలతో అభినందించారు.

మద్యం సీసాల స్వాధీనం

బాలాయపల్లి, ఏప్రిల్ 7: గూడూరు రూరల్ మండలంలోని వెందోడు గ్రామానికి చెందిన కంటెపల్లి హరిబాబు బాలాయపల్లి మండలంలోని జయంపు నుంచి ఎనిమిది మద్యం సీసాలు తీసుకువెళుతుండగా స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ మహబూబ్ సుబానీ తెలిపారు. నిందితుడిపై కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

ఉచితంగా వైద్య పరీక్షలు

గూడూరు అర్బన్, ఏప్రిల్ 7: ప్రపంచ ఆరోగ్యదినం సందర్భంగా పట్టణంలో పలు కూడళ్లల్లో స్వర్ణాంధ్రభారతి ఇంగ్లీష్ మీడియం పాఠశాల ఆధ్వర్యంలో ఉచిత వైద్యపరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ నవకోటి నాయుడు మాట్లాడుతూ ప్రపంచ ఆరోగ్యదినం సందర్భంగా తమ పాఠశాల ఆధ్వర్యంలో రక్త, బీపీ పరీక్షలను నిర్వహించడం జరిగిందన్నారు. ప్రతిఒక్కరూ వ్యాయామం చేస్తూ చక్కని ఆహారపు అలవాట్లతో ఆరోగ్యంగా ఉండాలన్నారు. వేసవిలో వడదెబ్బ తగలకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సునీల్, హరికృష్ణ, సింధూ, గిరి తదితరులు పాల్గొన్నారు.

ఉరేసుకుని టైలర్ మృతి

సూళ్లూరుపేట, ఏప్రిల్ 7: సూళ్లూరుపేట పట్టణంలోని తపాలా కార్యాలయం వద్ద టైలర్ షాపు నిర్వహిస్తున్న బాలసుబ్రహ్మణ్యం(48) తన షాపులోనే ఉరేసుకుని మృతి చెందిన సంఘటన ఆదివారం వెలుగులోకి వచ్చింది. బాలసుబ్రహ్మణ్యం సూళ్లూరులో కాపురం ఉంటున్నాడు. శనివారం ఇంటి నుంచి దుకాణానికి వచ్చాడు. రాత్రి షాపులోనే ఉండి ఫ్యాన్‌కు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకొన్నాడు. ఆదివారం ఉదయం 11 గంటలైనా షాపు డోర్ తెరవకపోవడంతో పక్కనే మరో షాపు యజమాని చూడగా బాలసుబ్రహ్మణ్యం ఉరేసుకొని ఫ్యాన్‌కు వేలాడుతూ కనిపించాడు. వెంటనే కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. ఆర్థిక ఇబ్బందులతో మనస్తాపం చెంది ఉరేసుకొని మృతి చెందినట్లు తెలిసింది. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

షార్ట్ సర్క్యూట్‌తో చర్చి దగ్ధం

చిట్టమూరు, ఏప్రిల్ 7: మండల పరిధిలోని మన్నెమాల గ్రామంలో ఉన్న చర్చి షార్ట్ సర్క్యూట్ కారణంగా దగ్ధమైంది. గ్రామంలో కొందరు క్రిష్టియన్లు పూరింటిని చర్చిగా మార్చుకున్నారు. ఆదివారం ప్రార్థనలు చేసుకొంటుండగా ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. ఈ ప్రమాదంలో కుర్చీలు, మైక్‌సెట్, స్పీకర్ బాక్స్‌లు, టేబుళ్లు, ఇతర పరికరాలు కాలిపోయాయి. తహసీల్దార్ శ్రీనివాస శర్మ ఆదేశాల మేరకు వీఆర్వో వెంకటేశ్వర్లు చర్చిని పరిశీలించి నివేదిక అందజేశారు. సుమారు 1.50లక్షల నష్టం జరిగినట్లు చర్చి నిర్వాహకులు తెలిపారు.



పూడి రాయదొరువు ముఖద్వారం వద్ద ఇసుక మేటలు - నీళ్లు లేక నెర్రెలు బారిన పులికాట్

నాడు కళకళ... నేడు వెలవెల

- నీళ్లు లేక నెర్రెలు బారిన పులికాట్ సరస్సు
- ముఖద్వారాల పూడికతీత కలేనా?

సూళ్లూరుపేట, ఏప్రిల్ 7: ఒకప్పుడు ఏడాది పొడవునా నిండుకుండను తలపించే పులికాట్ సరస్సు నేడు నీళ్ల లేక నెర్రెలు బారి ఎడారిని తలపిస్తోంది. ఆంధ్ర, తమిళనాడు సరిహద్దులో 620 చదరపు కిలో మీటర్లలో విస్తరించిన పులికాట్ పూర్వవైభవం కోల్పోయింది. ఆసియాలోని ఉప్పునీటి సరస్సుల్లో రెండో అతి పెద్దది పులికాట్. అపార మత్స్య సంపదకు నిలయంగా పేరగాంచిన ఈ సరస్సుపై ఆధారపడి దాదాపు 20వేల మందికి పైగా జీవనం సాగిస్తున్నారు. జిల్లాలోని తడ, దొరవారిసత్రం, సూళ్లూరుపేట, వాకాడు, చిట్టమూరు మండలాలు, తమిళనాడు రాష్ట్రంలోని గుమ్మడిపూడి, ఆరంబాకం, ఏలావూరు ప్రాంతాల్లో వరకు సరస్సు విస్తరించి ఉంది. సముద్రపు నుంచి ఉప్పునీరు, స్వర్ణముఖి, కాళంగి నదులు, పాముల కాలువ, కరిపేటి కాలువ నుంచి మంచినీరు పులికాట్‌లో కలవడంతో సరస్సులో దొరికే చేపలు, రొయ్యలు, పీతలు రుచికరంగా ఉంటాయి. ఇంతటి ప్రాముఖ్యం కలిగిన పులికాట్ పూర్వవైభవం కోల్పోయి మనుగడ ప్రశ్నార్థకంగా మారింది. గత టీడీపీ హయాంలో సరస్సు అభివృద్ధికి రూ.48 కోట్లు కేటాయించి సర్వే సైతం చేశారు. ప్రభుత్వం మారడంతో ఆ పనులు ఆగిపోయాయి. అధికారంలోకి వచ్చిన ఏడాదిలోపు పులికాట్ సరస్సు పూడిక తీత పనులు చేస్తామని పాదయాత్రలో జగన్ హామీ ఇచ్చారు. అధికారంలోకి వచ్చిన తరువాత నాలుగేళ్ల ఆ ఊసేఎత్తని జగన్ ఎన్నికల దగ్గరపడుతున్న తరుణంలో గతేడాది నవంబరులో ముఖద్వారాల పూడికతీతకు రూ.122 కోట్లతో శంకుస్థాపన చేస్తామని హడావిడి చేశారు. ఈ హడావిడి పనులకు వరుణుడు సైతం కరుణించకపోవడంతో వాయిదా పడింది. పర్యాటకంగా ఎంతో పేరొందిన పులికాట్ సరస్సు గురించి ఐదేళ్లుగా వైసీపీ ప్రభుత్వం పట్టించుకొన్న పాపాన పోలేదు. ఒకప్పుడు నాలుగు మీటర్ల లోతు ఉండే సరస్సు నేడు మీటరు లోతు కూడా లేదు. సముద్రం నుంచి నీరొచ్చే ముఖద్వారాలు పూడిపోవడంతో సముద్రపు నీరు పులికాట్‌కు రావడం లేదు. కేవలం వర్షాకాలంలో మూడు మాసాల మాత్రమే పులికాట్ జలకళతో ఉంటుంది. మిగిలిన కాలమంతా ఎడారిని తలిపిస్తోంది. ఏటా మత్స్య సంపద కూడా తగ్గిపోతుండడంతో జాలర్లు వేటలేక వలసబాట పడుతున్నారు. పక్కనే ఉన్న తమిళనాడులో పళ్లవర్‌కాడులో ఉన్న ముఖద్వారం వద్ద ఆ రాష్ట్ర ప్రభుత్వం ఏటా పూడిక తీస్తోంది. దీంతో తమిళనాడు ప్రాంతంలో మత్స్య సంపద విరివిగా దొరుకుతోంది. మళ్లీ ఎన్నికలు రావడంతో శనివారం నాయుడుపేటలో జరిగిన ప్రజాగళంలో చంద్రబాబు పులికాట్‌కు పూర్వవైభవం తీసుకొచ్చి సరిహద్దు సమస్య పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో మళ్లీ మత్స్యకారుల్లో ఆశలు చిగిరించాయి.

టీడీపీ అధికారంలోకి రాగానే రూ.4వేల పింఛన్



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులు

తడ, ఏప్రిల్ 7: టీడీపీ అధికారంలోకి వచ్చి చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రి కాగానే రూ.4వేల పింఛన్ ఇంటి వద్దకే పంపుతారని సూళ్లూరుపేట ఎమ్మెల్యే అభ్యర్థి నెలవల విజయశ్రీ, తిరుపతి ఎంపీ అభ్యర్థి వరప్రసాద్ వెల్లడించారు. ఆదివారం సాయంత్రం మాంబట్టులో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. జాతీయ రహదారి నుంచి ఎన్‌ఎం కండ్రిగ వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పింఛను ఇంటి వద్దకు పంపకుండా వైసీపీ ప్రభుత్వం డ్రామాలు ఆడి పేదలను ఇబ్బందులకు గురిచేసిందన్నారు. ప్రజా సమస్యల పట్ల వైసీపీ ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని, ఆ పార్టీకి గుణపాఠం చెప్పాలని ప్రజలకు పిలుపునిచ్చారు. టీడీపీ ప్రభుత్వం ఏర్పడిన ఏడాది లోగా పులికాట్ పూడికతీత పనులను పూర్తి చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో నియోజకవర్గ ఇన్‌చార్జి నెలవల సుబ్రహ్మణ్యం, మాజీ మంత్రి పరసారత్నం, నాయకులు తిరుమూరు సుధాకర్‌రెడ్డి, వేనాటి సతీష్‌రెడ్డి, మురళీరెడ్డి, చిల్లకూరు సురేష్‌రెడ్డి, బొమ్మన పళణి, వేనాటి రాజారెడ్డి, సెల్వం తదితరులు పాల్గొన్నారు.

గ్రామ పాలనను నిర్వీర్యం చేసిన వైసీపీ: విజయశ్రీ

సూళ్లూరుపేట, ఏప్రిల్ 7: గ్రామాల్లో పాలనను నిర్వీర్యం చేసిన పాపం వైసీపీదేనని టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి నెలవల విజయశ్రీ అన్నారు. ఆదివారం మండల పరిధిలోని మంగానెల్లూరు, సుగ్గుపల్లి గ్రామాల్లో స్థానిక నాయకులతో కలిసి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చంద్రబాబుతోనే గ్రామాల్లో సుపరిపాలన జరుగుతుందని, జగన్ పాలనలో పంచాయతీ నిధులను సైతం పక్కదారి పట్టించి నిర్వీర్యం చేశారని విమర్శించారు. ఐదేళ్ల వైసీపీ పాలనలో గ్రామాలకు వెళ్లే రోడ్లకు తట్టెడు మట్టి వేసిన పాపాన పోలేదన్నారు. టీడీపీ అధికారంలోకి వస్తే అన్ని వర్గాల వారికి సంక్షేమ పథకాలు అందుతాయన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు కొక్కు శంకరయ్య, నాయకులు గాడి నారాయణ రెడ్డి, దేవారెడ్డి సుధాకర్ రెడ్డి, తాటిపర్తి శ్రీనివాసుల రెడ్డి, మోహన్ రెడ్డి, బుచ్చిబాబు, సుబ్రహ్మణ్యం, సుధాకర్ రెడ్డి, ఏలింబేటి సతీష్, మంగానెల్లూరు సర్పంచ్ కాటూరు శేఖర్, జనసేన నాయకులు పొన్నా కాటయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మికత, మానవ సేవలకు ప్రతీక రంజాన్



రంజాన్ కిట్లను అందజేస్తున్న మహ్మదీయన్ వెల్ఫేర్ నెట్‌వర్క్ సభ్యులు

గూడూరు, ఏప్రిల్ 7: ఆధ్యాత్మిక చింతనను పెంపొందించుకునేందుకు, పేదలకు సేవా కార్యక్రమాలను నిర్వహించేందుకు ప్రతీకగా రంజాన్ మాసం నిలుస్తుందని మహ్మదీయన్ వెల్ఫేర్ నెట్‌వర్క్ గౌరవాధ్యక్షుడు రియాజ్‌అహ్మద్ అన్నారు. ఆదివారం స్థానిక షాదీమంజిల్‌లో మహ్మదీయన్ వెల్ఫేర్ నెట్‌వర్క్ ఆధ్వర్యంలో రంజాన్ పండుగను పురస్కరించుకుని పేద ముస్లింలకు రంజాన్ కిట్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇస్లాం మతం ప్రకారం ప్రతిఒక్కరూ తమకు ఉన్నంతలో ఎంతో కొంత పేదలకు సాయం చేయాలన్నారు. రంజాన్ పండుగను అందరూ ఆనందంగా జరుపుకోవాలన్న ఉద్దేశంతో పేదలకు నిత్యావసరాల కిట్లు అందజేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో అబ్దుల్‌రహీం, కాలేషా, అన్వర్‌బాషా, మహబూబ్‌బాషా, రఫీ, కరిమల్లా, అప్సర్, నాజర్, మొబీన్‌బాషా, షబ్బీర్, జిలానీ, ఖాదర్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు నిత్యావసరాల పంపిణీ

గూడూరు అర్బన్, ఏప్రిల్ 7: స్థానిక డీఎస్‌ఆర్ కమ్యూనిటీహాలులో ఆదివారం సింహపురిరెడ్డి సంక్షేమసంఘం ఆధ్వర్యంలో దివ్యాంగులకు నిత్యావసరాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ధనుంజయరెడ్డి, ప్రజేంద్రరెడ్డి, శ్రీనివాసులురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అర్చకులు, పురోహితులకు సరుకుల పంపిణీ

వాకాడు, ఏప్రిల్ 7: మండలంలోని బాలిరెడ్డిపాళెం గ్రామంలో వెలసిన పట్టాభి రామాలయంలో సీతారామ ధార్మిక సేవాసంస్థ ఆధ్వర్యంలో అర్చకులు, పురోహితుల కుటుంబాలకు పల సరుకులు ఆదివారం పంపిణీ చేశారు. సంస్థ ప్రతినిధి దివి అనంతాచార్యులు మాట్లాడుతూ ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకొని ప్రవాస భారతీయులు రామిరెడ్డి వెంకటరామిరెడ్డి, హైమావతమ్మ దంపతుల ఆర్థిక సాయం రూ.2 లక్షలతో పల సరుకులు, కూరగాయలు, సంభావనను అర్చకులు, పురోహితులకు పంపిణీ చేశామన్నారు. కార్యక్రమంలో కొడవలూరు భక్తవత్సల్ రెడ్డి, దివి వంశీప్రియ, జ్యోతి, ఏపీ బ్రాహ్మణ క్రెడిట్ సొసైటీ మేనేజర్ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం



రక్తదానం చేసిన వారికి సర్టిఫికెట్లు అందజేస్తున్న సునీల్‌కుమార్

గూడూరు, ఏప్రిల్ 7: రక్తదానం ప్రాణదానంతో సమానమని మాజీ ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ అన్నారు. ఆదివారం స్థానిక జనసేన పార్టీ కార్యాలయంలో అల్లు అర్జున్ ఫ్యాన్స్ ఆధ్వర్యంలో రక్తదానం శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా సునీల్‌కుమార్ మాట్లాడుతూ ప్రమాదాల్లో గాయపడి ఆపదలో ఉన్న వారిని ఆదుకునేందుకు రక్తదానం ఎంతో దోహదపడుతుందన్నారు. తలసేమియా వ్యాధితో బాధపడుతున్న చిన్నారులు ప్రతినెలా రెండుసార్లు రక్తం ఎక్కించుకోవాల్సిన అవసరం ఉంటుందని, అటువంటి చిన్నారుల ప్రాణాలను కాపాడేందుకు అల్లు అర్జున్ అభిమానులు రక్తదాన శిబిరం నిర్వహించడం స్ఫూర్తిదాయకంగా నిలుస్తుందన్నారు. అనంతరం రక్తదానం చేసిన వారికి సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో తీగల చంద్రశేఖర్, పేటేటి చంద్రసీల్, మోహన్, ఇంద్రవర్ధన్, శివ, సుమంత్, మణి, కార్తీక్, లోకేష్, ప్రశాంత్, గంగాధర్, దినేష్, క్రాంతి తదితరులు పాల్గొన్నారు.

గూడలిలో శేష వాహనసేవ

కోట, ఏప్రిల్ 7: మండల పరిధిలోని గూడలిలో గల కామాక్షిదేవి సమేత సంఘమేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం రాత్రి స్వామివారు శేష వాహనంపై ఊరేగారు. భక్తులు అడుగడుగున కొబ్బరికాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు. అంతకుముందు స్వామి, అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలతో గ్రామోత్సవం నిర్వహించారు. గూడూరుకు చెందిన మైథిలి ఆస్పత్రి యాజమానులు డాక్టర్ మైథిలి, రమణబాబు దంపతులు ఉభయకర్తలుగా వ్యవహరించారు.

మల్లాంలో రేపు గ్రామోత్సవం

చిట్టమూరు, ఏప్రిల్ 7: మల్లాంలోని శ్రీవల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో ఉన్న సకల దేవతల ఉత్సవ మూర్తులకు మంగళవారం గ్రామోత్సవం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ చిల్లకూరు సాయికుమార్‌రెడ్డి తెలిపారు. ఉగాది పండుగ పర్వదినం సందర్భంగా దేవతా ఉత్సవమూర్తులకు ప్రత్యేక పుష్పాలంకరణతో ఉత్సవం జరుగుతుందని తెలిపారు.

ముత్యాలమ్మకు పూజలు

చిల్లకూరు, ఏప్రిల్ 7: మండలంలోని తూర్పుకనుపూరు గ్రామంలో వెలసిన ముత్యాలమ్మకు ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. పలు ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు ఆలయం వద్ద పొంగళ్లు పెట్టి అమ్మవారికి నైవేద్యం నివేదించి దర్శించుకున్నారు. అనంతరం తీర్థప్రసాదాలు స్వీకరించారు.

ముమ్మరంగా వాహనాల తనిఖీ

పెళ్లకూరు, ఏప్రిల్ 7: మండలంలోని నెలబల్లి నుంచి తాళ్వాయిపాడు గోమతి సర్కిల్ వరకు జాతీయ రహదారిపై వాహనాలను ఎస్‌ఐ శ్రీకాంత్ ఆధ్వర్యంలో పోలీసులు ముమ్మరంగా తనిఖీ చేస్తున్నారు. కార్లు, బస్సులు, ఆటోలు, మోటార్ సైకిళ్ల క్షుణంగా పరిశీలిస్తున్నారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ ఎన్నికల నేపథ్యంలో నగదు, మద్యం రవాణాను అరికట్టేందుకు నాయుడుపేట-పెళ్లకూరు మండలాల సరిహద్దు ప్రాంతమైన గోమతి సర్కిల్‌తో పాటు, తొట్టంబేడు - పెళ్లకూరు సరిహద్దు ప్రాంతమైన నెలబల్లి వరకు తనిఖీలు చేస్తున్నామన్నారు. ప్రతి వాహనానికీ ఆర్‌సీ, పొల్యూషన్, ఇన్సూరెన్స్, ఎఫ్‌సీ, డ్రైవింగ్ లైసెన్స్, బ్యాడ్జిలను తనిఖీ చేస్తున్నామని చెప్పారు. సరైన పత్రాలు లేకుంటే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. మద్యం సేవించి వాహనాలను నడిపే వారిపై కూడా చర్యలు తీసుకుంటున్నామని ఎస్‌ఐ చెప్పారు.

ఉమ్మడి అభ్యర్థుల విజయానికి కృషి

సూళ్లూరుపేట, ఏప్రిల్ 7: టీడీపీ, బీజేపీ, జనసేన ఉమ్మడి అభ్యర్థుల విజయానికి కృషి చేయాలని రాష్ట్ర బలిజసేన అధ్యక్షుడు ఆక్రాస్టి శివప్రసాద్ అన్నారు. ఆదివారం జాతీయ రహదారి పక్కనే కీర్తి ఎన్ క్లేవ్ వద్ద బలిజ సేన కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి విచ్చేసిన ఎంపీ అభ్యర్థి వరప్రసాద్ రావును సన్మానించారు. ఈ సందర్భంగా సినీ నటుడు అల్లు అర్జున్ జన్మదినం సందర్భంగా రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో శంఖు సురేష్, ఆకుతోట రమేష్, బీమన శ్రీధర్‌రావు, బెల్లంకొండ సురేష్, తీగల బాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ నేతకు పరామర్శ

నాయుడుపేట, ఏప్రిల్ 7: తిరుపతి పార్లమెంటు టీడీపీ కార్యనిర్వాహణ కార్యదర్శి బిరదవాడ నారాయణను నెల్లూరు పార్లమెంటు తెలుగు మహిళా జిల్లా అధ్యక్షురాలు పనబాక భూలక్ష్మి పరామర్శించారు. నాయుడుపేట మండలం జువ్వలపాళెం గ్రామానికి చెందిన నారాయణ తల్లి చెంచులక్ష్మి ఇటీవల మృతి చెందారు. దీంతో నారాయణను ఆయన స్వగృహంలో పనబాక భూలక్ష్మి పరామర్శించారు. ఆమె వెంట చిన్న గంగయ్య, గంగాధరయ్య ఉన్నారు.

రేకుల ఇల్లు దగ్ధం

బాలాయపల్లి, ఏప్రిల్ 7: మండలంలోని అంబలపూడి గ్రామంలో ప్రమాదవశాత్తు రేకుల ఇళ్లు దగ్ధమైంది. స్థానికుల కథనం మేరకు.... సారమ్మకు చెందిన రేకుల ఇంటికి చుట్టు తాటాకులతో దడి ఏర్పాటు చేసుకుని జీవిస్తున్నారు. సారమ్మ దంపతులు పనుల నిమిత్తం బయట వెళ్లిన సమయంలో ప్రమాదవశాత్తు నిప్పంటుకుని దడితో పాటు ఇంట్లోని సామగ్రి కాలిపోయింది. స్థానికులు మంటలను అదుపు చేశారు. ఈ ప్రమాదంలో సుమారు రూ.50 వేల నష్టం వాటిల్లినట్లు బాధితులు తెలిపారు.

డంపింగ్ యార్డులో

అదుపులోకి రాని మంటలు

పట్టించుకోని మున్సిపాలిటీ అధికారులు

సూళ్లూరుపేట, ఏప్రిల్ 7: సూళ్లూరుపేట పట్టణంలోని హోలిక్రాస్ కూడలి సమీపంలోని జాతీయ రహదారి పక్కనే ఉన్న డంపింగ్ యార్డులో రెండు రోజులైనా మంటలు అదుపులోకి రాలేదు. ఆదివారం కూడా మంటలు కొనసాగడంతో పట్టణంతో పాటు వట్రపాలెం, జాతీయ రహదారి నుంచి మన్నారుపోలూరు వరకు దట్టమైన పొగ కమ్మేయడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. జాతీయ రహదారిపై వెళ్లే వాహనదారులకూ అవస్థలు తప్పలేదు. డంపింగ్ యార్డులో చెత్తకు గుర్తుతెలియని వ్యక్తులు శనివారం నిప్పు పెట్టడంతో మంటలు వ్యాపించాయి. స్థానిక అగ్నిమాపక సిబ్బందితో పాటు, షార్, హైవే అధికారులు అగ్నిమాపక వాహనాలను రప్పించి మంటలను ఆర్పేందుకు ప్రయత్నిస్తున్నా ఆదివారం సాయంత్రం వరకు అదుపులోకి రాలేదు. దుర్వాసన కూడిన పొగ వెలువడుతుండడంతో పట్టణమంతా కాలుష్య కోరల్లో చిక్కుకొంది. తరచూ ఇలాంటి సంఘటనలు జరుగుతుండడంతో డంపింగ్ యార్డు పక్కనే పంటపొలాలు, కాళంగి నది నీరంతా కలుషితమైపోతోంది. పొగకమ్మేసి ప్రజలతో పాటు జాతీయ రహదారి రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడినా మున్సిపాలిటీ అధికారుల్లో చలనం లేకపోవడంతో తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. డంపింగ్ యార్డును పట్టణానికి దూరంగా ఏర్పాటు చేసి ప్రజల ఆరోగ్యాన్ని కాపాడాలని పట్టణవాసులు కోరుతున్నారు.

సుపరిపాలన కోసం టీడీపీని గెలిపించండి



ప్రచారంలో నిర్వహిస్తున్న డాక్టర్ జశ్వంత్‌కుమార్

గూడూరు, ఏప్రిల్ 7: రాష్ట్రంలో ప్రజలకు సుపరిపాలన అందాలంటే త్వరలో జరగనున్న ఎన్నికల్లో టీడీపీని గెలిపించాలని మాజీ ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ తనయుడు డాక్టర్ జశ్వంత్‌కుమార్ అన్నారు. ఆదివారం స్థానిక ఐసీఎస్‌రోడ్డులో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం అధికారంలలోకి వచ్చినప్పటి నుంచి నిత్యావసరాల వస్తువుల ధరలను, విద్యుత్ చార్జీలను పెంచివేయడంతో పేదలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించడంలో వైసీపీ ప్రభుత్వ వైఫల్యం చెందిందన్నారు. గాడితప్పిన రాష్ట్రాన్ని అభివృద్ధి పథకంలో నడిపించాలంటే చంద్రబాబునాయుడుకే సాధ్యమవుతుందన్నారు. టీడీపీ అధికారంలోకి వస్తే యువతకు ఉపాధి అవకాశాలు మెరుగుపడుతాయన్నారు. త్వరలో జరగనున్న ఎన్నికల్లో ఉమ్మడి ప్రజాకూటమిని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో పులిమి శ్రీనివాసులు, పేటేటి వెంకటేశ్వర్లు, రవీంద్రరెడ్డి, నరసింహులు, శివకుమార్, సునీల్, సందీప్, ఆరికట్ల మస్తాన్‌నాయుడు, పార్వతయ్య తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ ఆత్మీయ సదస్సులో వీవోఏలు

కోట, ఏప్రిల్ 7: మండల పరిధిలోని విద్యానగర్‌లో ఆదివారం రాత్రి వైసీపీ యువ ఆత్మీయ సదస్సు జరిగింది. ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి పేర్నాటి శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి, యువజన విభాగం నాయకుడు చిల్లకూరు సాయిప్రసాద్‌రెడ్డి పర్యవేక్షణలో జరిగిన ఈ సదస్సులో ఎమ్మెల్యే అభ్యర్థి మేరిగ మురళి, తిరుపతి ఎంపీ అభ్యర్థి గురుమూర్తి, వైసీపీ సీఈసీ సభ్యుడు కొడవలూరు ధనంజయరెడ్డి, గూడూరు పరిశీలకులు ఎంఆర్‌సీరెడ్డి, నల్లపరెడ్డి వినోద్‌రెడ్డి ప్రసంగించారు. ఈ కార్యక్రమానికి వైఎస్సార్ క్రాంతిపథంలో పనిచేసే పలువురు వీవోఏలు హాజరయ్యారు. విలేకర్లు అప్రమత్తమై ఫొటోలు తీసేందుకు ప్రయత్నించగా పలాయనం చిత్తగించారు. కార్యక్రమంలో ఎంపీపీ అంజమ్మ, జడ్పీటీసీ కోటయ్య, బాలచంద్రారెడ్డి, సంపత్‌కుమార్‌రెడ్డి, మోబిన్‌బాషా, గురుస్వామి తదితరులు ఉన్నారు.

పూజారులకు సన్మానం



పూజారి దంపతులను సన్మానిస్తున్న ప్రగతి సేవాసంస్థ సభ్యులు

గూడూరు అర్బన్, ఏప్రిల్ 7: ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని ఆదివారం స్థానిక వీరభద్రస్వామి ఆలయంలో ప్రగతిసేవాసంస్థ ఆధ్వర్యంలో పూజారుల దంపతులను సన్మానించారు. ఈ సందర్భంగా సంస్థ అధ్యక్షుడు కడివేటి చంద్రశేఖర్ మాట్లాడుతూ తెలుగు నూతన సంవత్సరమైన ఉగాది పండుగను ప్రతి ఒక్కరూ ఆనందంగా జరుపుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో స్నేహలత, విష్ణువందన, జమునమ్మ, జీ.చంద్రశేఖర్, శ్రీనివాసులు, కరిముల్లా, ప్రభాకర్, రాము, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

సేవతోనే సంతృప్తి

గూడూరు అర్బన్, ఏప్రిల్ 7: పేదలకు సేవా కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా సంతృప్తి పొందుతామని ఆడిటర్ శ్రీకంటి రామమోహన్‌రావు అన్నారు. ఆదివారం స్థానిక మాళవ్యానగర్‌లో స్ఫూర్తి సేవాసమితి ఆధ్వర్యంలో వేసవి సందర్భంగా పేదలకు పాదరక్షలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎండలు అధికంగా ఉండడం వల్ల నడవడానికి పేదలు ఇబ్బందులు పడతుంటారని, వారికి ఆసరా ఉండేలా పాదరక్షలను అందజేశామన్నారు. కార్యక్రమంలో బాలకృష్ణంరాజు, దామోదర్, సత్యనారాయణ, కృష్ణంరాజు, సురేంద్ర, అనిల్‌కుమార్, రవికుమార్ పాల్గొన్నారు.